
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

గుంటూరు
జిల్లా వార్తలు


5 శనివారం 15 ఫిబ్రవరి 2025



నిధుల్లేకుండా.. ఏర్పాట్లు ఎలా?

- ఈవో లేఖ రాసినా స్పందించని ప్రభుత్వం
- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- పది రోజుల్లో మహా శివరాత్రి ఉత్సవాలు
- కోటప్పకొండ తిరునాళ్లపై చేతులెత్తేస్తున్న అధికారులు

8



దేవస్థానం వద్ద ఉచిత దర్శనం క్యూలైన్‌లకు తాటాకు పందిరి వేస్తున్న దృశ్యం

వ్యర్థాల నుంచి విముక్తి



- ప్రభుత్వ ఆస్పత్రులకు మార్గదర్శకాలు జారీ
- ఆస్పత్రుల్లో గుట్టలుగుట్టలుగా బయో వ్యర్థాలు
- 45 రోజుల్లో పనికిరాని వాటిని గుర్తించి వేలం

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఉపయోగంలో లేని, పనికిరాని వైద్య పరికరాలు, సామగ్రి, ఇతర వస్తువులు భారీగా పేరుకు పోవడంతో స్థలం కొరతతో ఇబ్బం దులు పడుతున్న గుంటూరు ప్రభుత్వాస్పత్రికి ఊరట లభించ నుంది. జీజీహెచ్‌లో ఎక్కడ చూసిన గుట్టలుగా పేరుకుపోయిన ఐరన్ స్క్రాప్ దర్శనమిస్తుంది. ఇలాంటి పనికిరాని ఐరన్ ఫర్నీచర్ నిల్వలతో ఎదురవుతున్న సమస్యల్ని సమీక్షించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వాటిని వదిలించుకునేందుకు నూతన మార్గదర్శ కాల్ని గురువారం ప్రకటించింది. ఇప్పటి వరకు అమలులో ఉన్న నిబంధనల మేరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడిసి)కి చెందిన బయో మెడికల్ ఇంజనీర్లు వ్యర్థ పదార్థాల్ని నిర్ధారించి వాటిని వేలం ద్వారా విక్రయించుకోవడానికి(డిస్పోజల్) నివేదికలు ఇస్తేనే ప్రభుత్వాస్పత్రులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ బయోమెడికల్ ఇంజనీర్ల కొరతతో ఈ దిశగా వ్యర్థాల్ని వదిలించుకునే ప్రయత్నాలు చేయలేదు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్) ద్వారా ఈ వ్యర్థాల్ని వదిలించుకోవాలన్న నిబంధన ఉంది. ఈ విషయంలో సీఎస్ఐఆర్ సహకారం కొరవడడంతో వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి.

ఈ అవరోధాల్ని గమనించిన వైద్య ఆరోగ్య శాఖ, వ్యర్థాల డిస్పోజ్‌కు సంబంధించిన నియామాల్లో (మిగతా 8వ పేజీలో)



స్వచ్ఛతకు.. ర్యాంకులు

- విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 14 సూచకలు.. 200 పాయింట్ల ఆధారం
- 117 పాయింట్లతో గుంటూరుకు 8వ ర్యాంకు
- 115 పాయింట్లతో 9వ స్థానంలో బాపట్ల జిల్లా
- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో వెనకబడిన పల్నాడు..
- ఇంటింట చెత్త సేకరణ, కార్యాలయాల శుభ్రతపై నేడు కార్యక్రమం

గుంటూరు సిటీ, బాపట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆయా కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన.. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర మిషన్‌కు శ్రీకారం చుట్టింది. ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యే క థీమ్‌ను ఎంచుకుని ప్రభుత్వ సిబ్బందితో పాటు ప్రజలను, విద్యార్థులను భాగస్వాములను చేసి అత్యంత శుభ్రత కలిగిన జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిన సంగతి తెలిసిందే. ఇందుకు అనుగుణంగా మార్గదర్శకాలను రూపొందించిన ప్రభుత్వం వాటిని యంత్రాంగం తప్పనిసరిగా పాటించాల్సిందేననే ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 14 సూచకలకు అంశాల వారీగా 200 పాయింట్లు కేటాయిం చింది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, డోర్ టు డోర్ కలక్షన్, చెత్త నిర్వహణ, విభజన, కమ్యూనిటీ సోక్ పిట్స్, క్లీన్ విలేజ్, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ వంటి అంశాలతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని తొలివిడతలో భాగంగా మూడో శనివారమైన జనవరి 18న ప్రభుత్వం చేపట్టింది. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం, పరిశుభ్రమైన వాతావరణం, విద్యార్థులకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై అవగాహన కల్పించడం ఇందులో ఉన్నాయి. వీటి ఫలితాలతో పాటు జిల్లాలో ఆ కార్యక్రమం అమలుకు మార్కులతో పాటు ర్యాంకులను శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో గుంటూరు జిల్లా మెరిసింది. పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖలు చేపట్టిన కార్యక్రమాలలో జిల్లాకు రాష్ట్ర వ్యాప్తంగా 8వ ర్యాంకు వచ్చింది. 14 సూచక(ఇండికేటర్స్)ల్లో జిల్లాకు 117 పాయింట్లు దక్కాయి. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో గుంటూరు జిల్లా తర్వాత స్థానం బాపట్లకు దక్కింది. 14 ఇండికేటర్స్‌లో బాపట్ల జిల్లాకు 115 పాయింట్లతో 9వ స్థానం నిలిచింది. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల పురోగతిలో పల్నాడు జిల్లా వెనకబడింది. ఈ జిల్లాకు 14 ఇండికేటర్స్‌లో 103 పాయింట్లు రాగా 20వ ర్యాంకుకు పరిమితమైంది.

నేడు మరో కొత్త థీమ్‌తో..

ప్రతి నెలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర మిషన్ కార్యక్రమాన్ని సరికొత్త థీమ్‌తో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా నేడు (శనివారం) సరికొత్త థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణతో పాటు చెత్త నుంచి సంపద సృష్టి, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయడం ఈ థీమ్‌లో ప్రముఖంగా చేర్చారు. జిల్లాల పరిధిలోని అన్ని విభాగాల అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరగను న్నాయి. ప్రజలు, విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. ప్రతి విభాగానికి ఓ నోడల్ అధికారిని నియమించి పర్యవేక్షణ బాధ్యతలను వారికి అప్పగించి ఫలితాల విషయంలో వారిని జవాబుదారీవహించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

యజ్ఞంలా స్వచ్ఛాంధ్ర



పంచాయతీరాజ్ శాఖతో పాటు మిగిలిన అన్ని శాఖలను కలుపుకుని ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం యజ్ఞంలా నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన 14 సూచకలు అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించి ఆ ప్రకారం ముం దుకు వెళ్తున్నాం. నెలలో మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి విధిగా పాల్గొని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, పని ప్రాంతాల్లో పరిశుభ్రతను పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతి మండలం, నియోజకవర్గంలో జరిగే ఈ కార్యక్రమాలను ప్రత్యేక అధికారులు పర్యవేక్షిస్తారు.

- చొప్పర కృష్ణ, డిప్యూటీ సీఈవో, జిల్లా పరిషత్, గుంటూరు



సీఆర్డీఏకు సవాలు

రాజధాని అమరావతిలో పనులు ప్రారంభమవుతున్నాయి.. అయితే రాజధానిలో ఆ పనుల పర్యవేక్షించే సీఆర్డీఏకు ప్రత్యేకంగా కార్యాలయం ఇప్పటికీ సమకూరలేదు. కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించినా సీఆర్డీఏకు కార్యాలయ భవనం పనులు ఒక సవాల్‌గా మారాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన జరిగి.. పనులు తుది దశకు చేరుకున్నాయి. అయితే వైసీపీ ప్రభుత్వ నిర్వాకం తో సీఆర్డీఏకు కార్యాలయం లేకుండా పోయింది. రాజధాని అమరావతిపై కక్ష సాధింపు క్రమంలో సీఆర్డీఏ భవనాన్ని మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతి పనులపై దృష్టి సారించింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్ర బాబు సీఆర్డీఏ కార్యాలయ పనులకు పునః శంకుస్థాపన చేశారు. రెండు నెలల్లో అందుబాటులోకి కార్యాలయం వచ్చి కార్యకలాపాలు ప్రారంభించాలని ఆదేశించి ఇప్పటికి నాలుగు నెలలు అవుతోంది. అయితే వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పనులు ఒక కొలిక్కి రావడం లేదు. పైగా అదనపు వ్యయంతో పాటు మాస్టర్ ప్లాన్ ప్రకా రం నిర్మాణాలకు సమయం వృథా అవుతోంది.

రాజధానిలో కార్యాలయానికి మోక్షమెప్పుడో?

- 2019లోనే తుది దశకు చేరినా వైసీపీ నిర్వాకంతో అస్తవ్యస్తం
- రెండు నెలల్లో అందుబాటులోకి వస్తుందన్నా.. పనుల్లో తీవ్రజాప్యం
- మాస్టర్‌ప్లాన్ ప్రకారం పనులకు అదనపు వ్యయం, సమయం వృథా



సీఆర్డీఏ కార్యాలయం, ఇన్‌సెట్లో పని చేస్తున్న కార్మికులు

నాలుగు నెలలు ఆగాల్సిందేనా?

తుది దశకు చేరిన సీఆర్డీఏ కార్యాలయ భవనాన్ని వైసీపీ హయాంలో ఇష్టం వచ్చినట్లుగా మార్చేశారు. అరకొర పనులే మిగిలాయి వాటిని పూర్తి చేసి రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావించారు. అయి తే పనులు చేపట్టిన తర్వాత చూస్తే మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా జరిగిన పనులను తొలగించడం పెద్ద తలనొప్పిగా మారింది. అస్తవ్యస్త నిర్మాణాల తొలగింపు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికే రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేశారు. అయితే ఇంకా అంతకు మించి ఖర్చు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. నిర్విరామంగా పనిచేసినా మరో నాలుగు నెలల వరకూ కార్యాలయం అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సీఆర్డీఏ)దే కీలకపాత్ర. రాజధాని నిర్మాణానికి సంబంధించిన విధి, విధానాలన్నీ సీఆర్డీఏ పర్యవేక్షణలోనే ప్రాణం పోసుకుంటాయి. అమరావతి రూపురేఖలన్నీ ఇక్కడే రూపుదిద్దుకుంటాయి. అలాంటి కీలక సంస్థకు రాజధాని అమరావతిలో ఇప్పటికీ కార్యాలయం లేదు. 2014- 19 కాలంలోనే సీఆర్డీఏ కార్యాలయాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని భావించారు. అయితే ఇప్పటి వరకూ ఆ కార్యాలయం అందుబాటులోకి రాలేదు. అందుకు కారణం గత వైసీపీ ప్రభుత్వం నడిపిన కక్షా రాజకీయాలే. అమరావతిపై దుగ్ధతో నాటి జగన్ ప్రభుత్వం చేసిన విచ్ఛిన్నమే నేటికీ రాజధానిలో సీఆర్డీఏ కార్యాలయం లేకుండా పోవడానికి కారణమన్న విమర్శలు వస్తున్నాయి. నాడు జగన్ చేసిన విధ్వంసం, ఆ తాలూకా విచ్ఛిన్నకర చర్యలే నేటికీ రాజధానిని వెంటాడుతున్నాయి. ఆ కారణంగానే సీఆర్డీఏ కార్యాలయ భవన నిర్మాణ పనులు అంతకంతకూ జాప్యమవుతున్నాయి.

● పదేళ్ల క్రితం సీఆర్డీఏ ఏర్పాటు

సీఆర్డీఏను 2014 డిసెంబరు 30న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాజధాని నిర్మాణ ప్రక్రియ మొత్తం సీఆర్డీఏ పర్యవేక్షణలో జరగనున్న నేపథ్యంలో సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన రావిపూడిలో కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 3.62 ఎకరాల్లో ఏడు అంతస్తులు, 2.42 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ భవన నిర్మాణం చేపట్టారు. కార్యాలయం చుట్టూ 2.5 ఎకరాల్లో ఉద్యానవనం ఏర్పాటుకు పూనుకున్నారు. 2017లో రూ.160 కోట్ల అంచనాలతో సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చే నాటికి భవనం ఏడంతస్తులు స్లాబ్ వరకూ పూర్తి అయింది. ఫినిషింగ్, ఇంటీరియర్, విద్యుత్, తదితర పనులు మాత్రమే పెండింగులో ఉన్నాయి. 80 శాతం పూర్తయిన ఆ పనులను జగన్ సీఎంగా ప్రమాణం చేసిన వెంటనే ఆపేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఆర్బీఐ కార్యాలయం ఏర్పాటుకు ఈ భవనాన్ని సూచించగా, అందుకు వారు అంగీకరించలేదు. బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఆ కార్పొరేషన్లకు కావాల్సిన కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి ఈ భవనాన్ని వాడుకోవాలని భావించారు. ఈ క్రమంలో సీఆర్డీఏ కార్యాలయ భవననమూనాను మార్చి 2023 కొత్తగా నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు ఆనిర్మాణాలే తలనొప్పిగా మారాయి.



సీఆర్డీఏ కార్యాలయం నిర్మాణ సామగ్రిని చేరవేస్తున్న కూలీలు

● ప్లాన్‌ను సరిదిద్దలేక పాట్లు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని అమరావతి నిర్మాణంపై దృష్టి (మిగతా 8వ పేజీలో)

విజయపురిసౌత్ రేంజ్ పరిధిలో 5 పులుల గుర్తింపు 8

21, 22 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు

ముగ్గురు డిప్యూటీ డీఈవోల నియామకం 6

గారపాడులో ఉద్రిక్తత.. పికెట్

- ఆలయం వద్ద పనులపై వివాదం
- వైసీపీ, టీడీపీ నేతల మధ్య వాదోపవాదాలు
- ఇరు వర్గాలకు సర్ది చెప్పిన డీఎస్పీ


పెదకూరపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆలయం వద్ద పనుల విషయంలో శుక్రవారం తలెత్తిన వివాదం మండలం లోని గారపాడులో ఉద్రిక్తతకు కారణమైంది. జడ్పీటీసీ కంక ణాల స్వర్ణ కుమారి, ఆమె భర్త శివాజీ గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వద్దకు వెళ్లిన సమయంలో వైసీపీ, టీడీపీ నేతల మధ్య వాదోపవాదాలు చోటు చేసు కున్నాయి. శివాలయం మెరక కోసం మట్టి తోలడా మునుకుంటే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు ఇవ్వాల్సిన అవసరం ఏముందని? వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ గణేష్ మాధవరావు, శివా జీలను టీడీపీ సీనియర్ నాయకుడు పెను ముచ్చు రామారావు ప్రశ్నించారు. దీంతో వారి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఆ తర్వాత ఇంటికి వెళ్లిన రామారావు జరిగిన విషయాన్ని తన వర్గీయులకు చెప్పారు. దీంతో టీడీపీకి చెందిన వారు శివాజీ, మాధవరావుల వద్దకు వెళ్లి గతంలో ఆంజనేయస్వామి గుడికి తాము ఇచ్చిన చందాల లెక్కలు చెప్పాలని డిమాండ్ చేయడంతో వారి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో వైసీపీ వర్గీయులు ఆంజనేయస్వామి గుడిలోకి వెళ్లి తలుపులు వేసు కోగా బయటకు రావాలంటూ టీడీపీ వారు కేకలు వేశారు. ఆల యంలో ఉన్న వైసీపీ వారు 100 నెంబరుకు ఫోన్ చేయడంతో సత్తెన పల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు, సీఐ సురేష్ సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. టీడీపీ, వైసీపీ వర్గీయులతో డీఎస్పీ మా ట్లాడి సర్ది చెప్పారు. జడ్పీటీసీని ఇంటికి పంపించి వైసీపీ నాయకులను పెదకూరపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. గ్రామంలో గొడ వలు జరగకుండా పికెట్‌ను ఏర్పాటు చేశారు.



గారపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతరావు

ప్రజా రక్షణలో రాజీపడొద్దు

- శాంతిభద్రతలను కాపాడేందుకే పోలీసులు
- తెనాలి పోలీస్ పరేడ్‌లో ఎస్పీ సతీష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రజలకు రక్షణ కల్పించడంలో ఎక్కడా రాజీపడవద్దని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో తెనాలి సబ్‌డివిజన్ పోలీసులతో పరేడ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎస్పీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సిబ్బంది యూనిఫాం ధరించే తీరు, వారి శరీర దృఢత్వం, క్రమశిక్షణలను ఎస్పీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీస్ వ్యవస్థ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. పోలీసుల విధి నిర్వహణలో పరేడ్ అతిముఖ్యమైనదన్నారు. పోలీసులు మార్చింగ్, వెపన్ డ్రిల్ వంటివి చేయడం ద్వారా శారీరక దృఢత్వం, డిసిప్లెన్, మానసిక ఉల్లాసం మెరుగుపడతాయన్నారు. విధులు నిర్వహించే సమయంలో ప్రజల రక్షణ కోసం పనిచేస్తున్నామన్న విషయాన్ని పోలీసులు గుర్తించుకోవాలన్నారు. స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారికి తగిన గౌరవం ఇచ్చి వారి సమస్యలను సావధానంగా ఆలకించి భరోసా నింపాలన్నారు. బాధితులతో స్నేహపూర్వకంగా ఉంటూ చట్ట ప్రకారం రక్షణ కల్పించి, అండగా నిలిచి పోలీస్ వ్యవస్థకు మంచి పేరు తేవాలన్నారు. కేసుల పరిష్కారం, ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపుతున్న వారిని ఎస్పీ అభినందించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆటో ఓనర్లు, డ్రైవర్లతో జరిగిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఆటో నడిపే సమయంలో యూనిఫాంను తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రయాణికులకు తగిన గౌవరం ఇస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ దీక్షా, అదనపు ఎస్పీ(ఏఆర్) ఎ.హనుమంతరావు, తెనాలి డీఎస్పీ జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

● ఆటో డ్రైవర్లు, యజమానులకు సూచనలు చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్



ముగ్గురు డిప్యూటీ డీఈవోల నియామకం


డీఈవో సీవీ రేణుకకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసురత్నం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముగ్గురు డిప్యూటీ డీఈవోల్ని నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు డిప్యూటీ డీఈవోగా జి.ఏసురత్నం, బాపట్ల డిప్యూటీ డీఈవోగా కె.సురేష్, నర్సరావుపేట డిప్యూటీ డీఈవోగా ఎస్కే మహబూబ్ సుభాని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో సీనియర్ ఎంఈవోగా ఉన్న జి.ఏసురత్నంను గుంటూరు డిప్యూటీ డీఈవోగా నియమించారు. ఈ సందర్భంగా డీఈవో సీవీ రేణుక, ఆర్జేడీ లింగేశ్వర రెడ్డిని ఏసురత్నం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ ఎస్కే ఎండీ ఖాసిం, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

వ్యర్థాల నుంచి విముక్తి

(5వ పేజీ తరువాయి)

తగు సవరణల ద్వారా ప్రభుత్వాస్పత్రులు వ్యర్థాల్ని వదిలించుకునే వెసులుబాటు కల్పించారు. ప్రభుత్వ సర్వ జనాసుపత్రులు జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వాటి స్థాయిలోనే పేరుకుపోయిన వ్యర్థాల్ని వదిలించుకోవచ్చు. ఈ మేరకు వివిధ ఆస్పత్రుల స్థాయిలో వ్యర్థాల నిర్ధారణ, వాటి వేలం నిర్వహణకు కమిటీల ఏర్పాటుపై నియమాల్ని రూపొందించారు. ఇప్పటివరకు పేరుకుపోయిన వ్యర్థాల్ని కొత్త నిబంధనల ప్రకారం 45 రోజుల్లో వదిలించుకోవాలి. అనంతరం ఈ ప్రక్రియను ప్రతి ఏడాది చేపట్టాలి. తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఖాతాలో జమచేయాలి. ఆస్పత్రుల వారీగా పేరుకుపోయిన వ్యర్థాల విలువను అంచనా వేయాలని బయో మెడికల్ ఇంజనీర్లను ప్రభుత్వం ఆదేశించింది. డిస్పోజల్ ద్వారా రూ.25 వేలు మించి ఆదాయం వచ్చే అవకాశం ఉంటే 'కొనుగోలు' ఈ ఆక్షన్ పోర్టల్ ద్వారా వేలం వేయాలి. లేకుంటే కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన మెటల్ స్క్రాప్ ట్రేడింగ్ కార్పొరేషన్ ద్వారా విక్రయించాలి.

డేటా ఆధారిత పరిపాలన కీలకం

- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా



ప్రసంగిస్తున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, వేదికపైన వీసీ, వర్సిటీ అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పరిపాలన, వ్యాపార వ్యూహాల్లో డేటా కీలకమైన స్థానం కలిగి ఉందనీ, విశ్లేషణలు, కృత్రిమ మేధస్సును సద్వినియోగం చేసుకునే సామర్థ్యం గల సంస్థలే భవిష్యత్తులో విజయాన్ని సాధిస్తాయని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, సర్వే సెటిల్‌మెంట్, భూపరిపాలన) ఆర్.పి.సిసోడియా అన్నారు. శుక్రవారం వర్సిటీలో 'బిజినెస్ అనలిటిక్స్, ఇంటెలిజెన్స్‌లో పురోగమనలు' అనే అంశంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిసోడియా ప్రసంగిస్తూ డేటా ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతను వివరించారు. ఆదాయ నిర్వహణ నుంచి ప్రజా సేవల దాకా అనేక రంగాల్లో కృత్రిమ మేధస్సు, పెద్ద డేటా విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయని అన్నారు. డేటా విశ్లేషణను సమర్థంగా వినియోగించుకునే సంస్థలు ఆర్థిక అభివృద్ధిలో ముందంజలో ఉంటాయన్నారు. ఎవరు డేటాను సమర్థంగా విశ్లేషించి, అర్థం చేసుకుంటారో వారే భవిష్యత్తులో విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. డేటా ఆధారిత భారతదేశాన్ని నిర్మించేందుకు మనమందరం కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య ఒప్పందాలు, పరిశోధనలో భాగస్వామ్యం పెరగడం అభినందనీయమని అన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం బిజినెస్ అనలిటిక్స్ పరిశోధన, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. సదస్సు డైరెక్టర్, వాణిజ్య, వ్యాపార పరిపాలన విభాగాధిపతి ఆచార్య రామినేని శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ వ్యాపార వ్యూహాలలో డేటా విశ్లేషణ ప్రాధాన్యతను వివరించారు. ఐఐఎం విశాఖపట్నంకు చెందిన ఆచార్య విజయ భాస్కర్ మాట్లాడుతూ బిజినెస్ ఇంటెలిజెన్స్‌లో ఏఐ, మెషిన్ లెర్నింగ్ పెరుగుతున్న ప్రభావాన్ని వివరిస్తూ, నైతిక డేటా నిర్వహణ కీలకమని అన్నారు. ఐఐఎం రాయ్‌పూర్‌కు చెందిన వర్ష మామిడి, మేధో సంపత్తి హక్కులు, డేటా విశ్లేషణ అనుసంధానంపై మాట్లాడారు. ఐపీఈ హైదరాబాదు డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాస మూర్తి భవిష్యత్తు అంచనాల ప్రాముఖ్యతను వివరిస్తూ, వివిధ పరిశ్రమల్లో దీని వాస్తవ ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ రత్న కిషోర్ పాల్గొన్నారు.

వారసత్వ అమరావతిని నాశనం చేశారు

- ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ


ధరణికోటలోని నూనెగుండం చెరువును పరిశీలిస్తున్న ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ

అమరావతి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) అభివృద్ధి చేస్తారని వైసీపీకి ప్రజలు అధికారం ఇస్తే అన్ని వ్యవస్థలు నాశనం చేయడమే కాకుండా రాజధాని అమరావతితోపాటు వారసత్వ అమరావతిని కూడా సర్వనాశనం చేశారని రాష్ట్ర పర్యాటక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి వైసీపీ పాలనలో పర్యాటక రంగానికి పూర్తిగా విఘాతం కలిగిందనీ, కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వీర్యం అయ్యాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. పర్యాటక రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారని తెలిపారు. దీంతో చైర్మన్ బాలాజీ శుక్రవారం మధ్యాహ్నం వారసత్వ అమరావతిని సందర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల నిధులతో నిర్మించిన అభివృద్ధి పనులను పరిశీలించారు. వారసత్వ కేంద్రంలో గత ప్రభుత్వం మద్యం దుకాణం నిర్వహించారని తెలుసుకుని మండిపడ్డారు. అనంతరం ధ్యానబుద్ధ ప్రాజెక్టు, బుద్ధవనం పరిశీలించారు. తదుపరి ధరణికోట గ్రామంలో రూ.7 కోట్లతో అభివృద్ధి చేసిన నూనెగుండం చెరువు నిరుపయోగంగా ఉండటాన్ని గమనించారు. చారిత్రక ప్రాధాన్యత ఉన్న అమరావతిని గత ప్రభుత్వ పర్యాటకరంగం పూర్తిగా విస్మరించిందన్నారు. డీవీఎం కృష్ణచైతన్య, అసిస్టెంట్ మేనేజర్ కొల్లి శ్రీధర్, కొండయ్య, విజయవాడ మేనేజర్ శ్రీనివాస్, అమరావతి మేనేజర్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం ఎడ్లకు ప్రథమ స్థానం


ఆరుపళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లు

మాచవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యల కల్యాణాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు జరుగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఆరు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు నాలుగు వేల అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడు గ్రామానికి చెందిన ఏటుకూరి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెం గ్రామానికి చెందిన రామినేని రత్తయ్య చౌదరి కంబైన్డ్ జత 3773.7 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో నిలిచాయి. తెలంగాణ రాష్ట్రం కోదాడ మండలం నలమాద ఉత్తమ పద్మావతిరెడ్డి ఎడ్లు 3420.1 అడుగుల దూరాన్ని లాగి మూడో స్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు ఎడ్లు 3396.1 అడుగుల దూరాన్ని లాగి నాలుగో స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్లు 3023.5 అడుగుల దూరాన్ని లాగి ఐదో స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన మన్నెంపల్లి యశశ్విని, పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన వసంత వరపు శ్రీలాస్య, శ్రీమనోజ్ కంబైన్డ్ జత 2339.5 అడుగుల దూరాన్ని లాగి ఆరో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన యామని రామారావు ఎడ్లు రెండు వేల అడుగుల దూరాన్ని లాగి ఏడో స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా గురజాల మండలం గోగులపాడు గ్రామానికి చెందిన ముత్తన వెంకటరెడ్డి ఎడ్లు 528.3 అడుగుల దూరాన్ని లాగి 8వ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్లకు నగదు బహుమతితో పాటు షీల్డ్ బహూకరించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా దుర్గి గ్రామానికి చెందిన దుగ్గి శ్రీనివాసరావు వ్యవహరించారు. ఎడ్ల పోటీలకు కావాల్సిన వసతులను కమిటీ వారు ఏర్పాటు చేశారు.

వర్సిటీలో లా విద్యార్థుల ఆందోళన


లా విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం

పెదకాకాని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కులవివక్షతతో న్యాయశాస్త్రం విభాగాధిపతి తమను మొదటి ఇంటర్నల్ పరీక్షలను రాయనివ్వలేదంటూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎల్.ఎల్.ఎం. ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఆందోళనకు దిగారు. విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.ఎం. ప్రథమ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ చదువుతున్న 30 మంది విద్యార్థులకు విశ్వవిద్యాలయం నిబంధనల ప్రకారం తగినంత హాజరు లేదంటూ న్యాయశాస్త్రం విభాగాధిపతి ప్రథమ సెమిస్టర్ ప్రథమ ఇంటర్నల్ పరీక్షలకు అనుమతివ్వలేదు. అలాగే న్యాయశాస్త్రం విభాగాధిపతి ఎల్.ఎల్.ఎం. విద్యార్థులకు బోధన చేస్తున్న ఓ అతిథి అధ్యాపకురాలును విద్యార్థుల హాజరు ఇవ్వాలంటూ ఆదేశించారు. దీంతో న్యాయశాస్త్రం విభాగంలో పనిచేస్తున్న కొందరు అతిథి అధ్యాపకులు ప్రథమ ఇంటర్నల్ పరీక్షలకు అనుమతి లభించని విద్యార్థులను కలుపుకొని విభాగాధిపతికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. విభాగాధిపతి కులవివక్షతతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను హాజరు పేరుతో అణగదొక్కుతున్నారంటూ ఆరోపించారు. విభాగాధిపతి తన కులానికి చెందిన ఓ విద్యార్థి కళాశాలకు రాకపోయినా పరీక్షలకు అనుమతించారని ఆరోపించారు. సమాచారం అందుకున్న తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం తగిన న్యాయం చేస్తామంటూ విద్యార్థులకు హామీ ఇచ్చారు.

రెండు ట్రాలీ ఆటోలు ఢీకొని యువకుడి మృతి


ప్రమాదంలో నుజ్జయిన ట్రాలీ ఆటో

శావల్యాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు ట్రాలీ ఆటోలు బలంగా ఢీకొట్టుకోవడంతో యువకుడు మృతి చెందగా, ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో శావల్యాపురం సొసైటీ కార్యాలయం ఎదురుగా గురువారం అర్ధరాత్రి జరిగింది. స్థానిక ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు ప్రకాశంజిల్లా మార్కాపురం నియోజకవర్గం పెదఅరవీడు గ్రామానికి చెందిన ఆమనిగంట వెంకటరమణ(19), సంకుల ఆంజనేయులు, సంకుల గోపి, కోటపాటి గోపీలు టెంటుసామగ్రి, మైకులు బాగు చేయించుకొనేందుకు గుంటూరుకు వెళ్లి గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో శావల్యాపురంలో సొసైటీ కార్యాలయం వద్దకు రాగానే దోర్నాల నుంచి పిడుగురాళ్లకు వెళ్తున్న ట్రాలీ ఆటో ఎదురుగా వస్తుండగా నిద్రమత్తులో దాన్ని బలంగా ఢీకొట్టారు. దాంతో ఆమని వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందగా సంకుల ఆంజనేయులు, గోపి, కోటపాటి గోపీలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ లోకేశ్వరరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందాడు. నల్లపాడు సీఐ వంశీధర్ కథనం మేరకు... చిలకలూరిపేటకు చెందిన బొన్నం వెంకయ్య (75)ను పెద్ద కుమారుడు పూర్ణచంద్రరావు కాటూరి ఆసుపత్రిలో పరీక్షించేందుకు శుక్రవారం తీసుకొస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల సమీపానికి రాగానే ఓ లారీ వేగంగా మీదుగారాగా పక్కకు తప్పించాడు. దీంతో అదుపుతప్పిన ద్విచక్ర వాహనం పక్కనే ఉన్న రైలింగ్‌ను ఢీ కొట్టింది. తండ్రి వెంకయ్య ఘటనా స్థలంలోనే మృతి చెందారు. గాయపడిన పూర్ణచంద్రరావును ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగుతేజం హారిక గోవాడకు అంతర్జాతీయ అవార్డు



పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉమెన్ టూ వాచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డుతో అమెరికాలో తెలుగుతేజం మెరిసింది. గుంటూరు జిల్లా పొన్నూరులోని నిడుబ్రోలుకు చెందిన హారిక గోవాడ అంతర్జాతీయ అవార్డు పొందడమే కాకుండా అంతర్జాతీయ మ్యాగ్జైన్ ఫ్యాషన్ విస్టా ముఖచిత్రంపై స్థానం సంపాదించింది. ఆమెపై ప్రత్యేక వ్యాసాన్ని మ్యాగ్జైన్ ప్రచురించింది. నిడుబ్రోలుకు చెందిన గోవాడచౌదరి కుమారుడు గోవాడ హరిబాబు లక్ష్మీప్రసన్నల కుమార్తె హారిక గీతం యూనివర్సిటీలో బీటెక్ అభ్యసించింది. అనంతరం క్యాటర్ పిల్లర్ కంపెనీ ఫెలోషిప్ ద్వారా అమెరికాలోని బ్రాడ్లీ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ ఎమ్మెస్‌ను అభ్యసించారు. అనంతరం హారిక పోర్టుఫోలియో రికవరీ అసోసియేట్ కంపెనీలో చేరి అంచెలంచెలుగా ఎదిగి అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగారు. టెక్నాలజీ రంగంలో గ్రిడ్, డిటర్మేషన్‌తో సాంకేతిక రంగంలో సేవలు అందిస్తున్నారు. హారిక సేవలను గుర్తించి ఉమెన్ టూ వాచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును అందజేసింది. హారిక అంతర్జాతీయ అవార్డు పొందడంపై పొన్నూరు, నిడుబ్రోలువాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అశ్రునయనాలతో సురేష్ అంత్యక్రియలు



రొంపిచర్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల గ్రామానికి చెందిన చెరుకూరి సురేష్(25) గత నెల 31వ తేదీన ఐర్లాండ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో అతని మృతదేహాన్ని స్వగ్రామమైన రొంపిచర్లకు శుక్రవారం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అతన్ని చూసేందుకు గ్రామస్థులు, బంధువులు అధిక సంఖ్యలో పడమటిపాలెంలో ఉన్న అతని గృహం వద్దకు వచ్చారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు రామకోటయ్య, కుమారి రోదిస్తున్న తీరు స్థానికులకు కంట తడి పెట్టించింది. ప్రభుత్వం తరుపున పలువురు బేగంపేట విమానాశ్రయం నుంచి గ్రామానికి తీసుకు వచ్చారు. 14 రోజుల తరువాత ఐర్లాండ్ నుంచి మృతదేహాన్ని తీసుకు వచ్చారు. అశ్రునయనాలతో అంత్యక్రియలు జరిగాయి.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రత్తిపాడు (వంగిపురం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని వంగిపురం గ్రామంలో జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం వంగిపురం గ్రామానికి చెందిన వరగాని బాబురావు (59) తనకున్న 40 సెంట్ల భూమితోపాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశారు. గత మూడేళ్లగా పంటలు పూర్తిగా దెబ్బతిని పూర్తి నష్టాలు వచ్చాయి. ఈ ఏడాది కూడా మిర్చి, పత్తి పంటలను సాగు చేశారు. పంటలు దెబ్బతినడంతో అప్పులు తీర్చుకోలేననే బాధతో గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెక్‌పోస్టు సెంటర్‌లోని అమరావతి హోండా షోరూమ్, వెంకటేశ్వర రైతు సేవా కేంద్రంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దొంగలు రూ. 3.10 లక్షల నగదును అపహరించుకు వెళ్లారు. శుక్రవారం ఉదయం సమాచారం తెలుసుకున్న వాటి నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. దొంగలు షోరూం, రైతు సేవా కేంద్రం తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లి రెండు దుకాణాల్లో సీసీ కెమెరాల వైర్లను ధ్వంసం చేసి సీసీ కెమెరాల డీవీఆర్‌లను అపహరించుకు వెళ్లారు. రైతు సేవా కేంద్రంలో ఉన్న రెండు లక్షల నగదు, హోండా షోరూంలో ఉన్న రూ.83వేల నగదును అపహరించారు. సీసీ టీవీ డీవీఆర్‌ల విలువ రూ.27 వేలు వరకు ఉంటుంది. ఆయా షాపుల నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ బ్రహ్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో నిందితుడు అరెస్టు

దుర్గి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆయన మాట్లాడుతూ మండలంలోని తేరాలకు చెందిన బొంతా వీరయ్యపై 2000 సంవత్సరంలో శీలం సిద్ధయ్య, వెంకటేశ్వర్లు దాడి చేసి గాయపరిచారన్నారు. ఆ సమయంలో సిద్ధయ్య, వెంకటేశ్వర్లుపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. కేసు విచారణలో ఉండగా సిద్ధయ్య కోర్టుకు హాజరుకాకుండా పరారయ్యాడన్నారు. కాగా వెంకటేశ్వర్లును మాచర్ల పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి మూడేళ్ల జైలు శిక్ష విధించారన్నారు. పరారీలో ఉన్న సిద్ధయ్యను శుక్రవారం అరెస్టు చేసి మాచర్ల పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్ నిందితునికి మూడేళ్ల జైలు శిక్ష విధించారని ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రకాశం బ్యారేజి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం కృష్ణానదిలో గుర్తించారు. సీఐ కల్యాణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం బ్యారేజి 4వ కానా వద్ద మృతదేహాన్ని గమనించిన స్థానికులు సమాచారం ఇచ్చారు. మత్స్యకారుల సాయంతో సదరు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, ఒంటిపై బచ్చలిపండు రంగు టీ షర్టు, కాకి రంగు షార్ట్ ఉన్నాయని, తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిస్తే తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం శుక్రవారం నాటికి 540.80 అడుగులు ఉంది. ఇది 188.32 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9633 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 7974 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 28,541 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 14,027 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121,129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

1,00,564 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 91,613 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,00,564 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 48,224 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13600	334	11000	11000
నెంబరు. 5	10000	12500	నెంబరు.5	--	--
273	10000	12200	273	--	--
341	10000	14000	341	--	--
4884	10000	12500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13900	తేజ	--	--
బ్యాడిగి	10000	13000	బ్యాడిగి	11000	11000
దేవనూరు డీలక్స్	10000	13200	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4500	7500	తెల్లకాయలు	4500	6500

వంశీకి తగిన శిక్ష పడాలి

● వడ్రాణం హరిబాబు

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని అనరాని మాటలు అన్న వంశీకి తగిన శిక్ష పడాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం హరిబాబు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ హయాంలో గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అధికారాన్ని అడ్డుపెట్టుకొని చేసిన అరాచకాలకు, అక్రమాలకు అడ్డు అదుపు లేదన్నారు. వంశీ కారణంగా అక్రమ కేసులకు గురై జైలు శిక్ష అనుభవిస్తూ బెయిల్ రాకుండా కుటుంబాలకు దూరమైన బాధితులందరూ వంశీ అరెస్టుతో హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. వంశీ పెట్టిన అక్రమ కేసు వల్ల గన్నవరం నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్న తాను కుటుంబానికి దూరంగా 38 రోజులు ఉండాల్సివచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశీ శాశ్వతంగా కటకటాల వెనక్కి వెళ్ళడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో బొబ్బిలి రామారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం ఇజ్రాయిల్‌పేట, ఎన్‌టీఆర్ నగర్, మంగళదాస్‌నగర్, అంబేద్కర్‌నగర్, అరుంధతినగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అలానే శ్రీనగర్ 7/2వ లైను నుంచి 7/7వ లైను వరకు, మల్లికార్జునపేట 1, 2, 5 లైన్లు, గోపాలకృష్ణయ్య కాలనీలో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ గురవయ్య మరో ప్రకటనలో పేర్కొన్నారు.

ఉచిత పథకాలు రాజకీయ పార్టీల దివాలాకోరు తనమే

● జనతాదళ్(యు) రాష్ట్ర కార్యదర్శి నల్లపనేని

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పోటీలు పడి ప్రకటిస్తున్న ఉచిత పథకాలు రాజకీయ పార్టీల దివాలాకోరు తనానికి నిదర్శనంగా కనిపిస్తున్నాయని జనతాదళ్(యు) రాష్ట్ర కార్యదర్శి నల్లపనేని సాంబశివరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు కూడా తీవ్రమైన వ్యాఖ్యలు చేసిందన్నారు. ఉచితాలకు మరిగిన చాలామంది పనికి వెళ్ళటం కూడా మానుకున్నందు వల్ల కూలీల కొరత ఏర్పడిందన్నారు. కూలీల కొరత వల్ల వ్యవసాయ, నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వాలు మేల్కొని ఉచిత పథకాల ప్రకటనలు మానుకోవాలని, మ్యానిఫెస్టోలో అటువంటి శుష్క వాగ్దానాలు ఉంటే ఎన్నికల కమిషన్ ఆయా పార్టీలపై వెంటనే చర్యలకు సిఫార్సు చేయాలని అన్నారు.

రేపు 'వాల్మీకి రాయని రామాయణం' గ్రంథావిష్కరణ

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అమరావతి సాహితీ మిత్రులు నిర్వహణలో అబ్దుల్ రజా హుస్సేన్ రచన 'వాల్మీకి రాయని రామాయణం' గ్రంథాన్ని బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఈ నెల 16న ఉదయం ట్రెజరీ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ నందిపాటి నాగేశ్వరరావు ఆవిష్కరిస్తారని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. గంగవరపు సునీత (చిలకలూరిపేట) 'ఈ మాసం కవి'గా పాల్గొంటారు. 'నిక్కచ్చి కవిత' పోటీకి 'పెంపకం' అంశం మీద ఎవరైనా కవితలు చదివి వినిపించవచ్చని ఆయన తెలిపారు.

గుజ్జనగుండ్లలో కన్నుల పండువగా పోలేరమ్మ తల్లి కొలుపులు

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గుజ్జనగుండ్లలో గ్రామ దేవత పోలేరమ్మ తల్లి అమ్మవారి కొలుపులు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. అదేవిధంగా బొడ్రాయి 12వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 12న ప్రారంభమైన ఉత్సవం 16న కొలుపులతో ముగియనుంది. దీనిలో భాగంగా ఈనెల 15న భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. 16న ఉదయం పొంగళ్ళు, మేళ తాళాలతో ఊరేగింపు జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం చండీ హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శని, ఆదివారాల్లో జరగనున్న కొలుపుల ముగింపు కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావాలని వారు కోరారు.

భారీ మెజారిటీతో ఆలపాటిని గెలిపించాలి

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ జోన్-5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) పిలుపునిచ్చారు. నగరంలోని 37వ డివిజన్ చంద్రమౌళి నగర్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరుపున శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో మాజీ మంత్రి ఆలపాటికి ప్రథమ ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఓటర్లకు ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముత్తినేని రాజేశ్, రావిపాటి సాయికృష్ణ, లాల్ వజీర్, పి.శ్రీకాంత్, ధర్మతేజ, అవినాశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూరిఫాతిమాకు నేతల అభినందనలు

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ నగర అధ్యక్షురాలిగా నియమితులైన షేక్ నూరిఫాతిమాకు ఆ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. మంగళదాస్ నగర్‌లోని కార్యాలయంలో ఆ పార్టీ నేత మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, బీసీ నాయకుడు బాదినేడి కిషోర్, శ్రీనివాసరెడ్డి, బి.రాములు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రతిష్ఠాత్మకంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్

● కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 3వ శనివారం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందని, నగరంలో ప్రతి ఒక్కరిని కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని నోడల్ అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం నగరంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో నోడల్, ప్రజారోగ్య అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ శనివారం నోడల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటికి తడి, పొడి వ్యర్థాల విభజన, హోం కంపోస్ట్ తయారీ, ర్యాలీల ద్వారా సచివాలయ కార్యదర్శులు, కార్మికులు స్థానిక ప్రజలకు అవగాహన కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా మాస్ క్లీనింగ్ చేసుకునేలా తెలియజేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కృషి

స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని, అందులో భాగంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ-కామర్స్ ప్లాట్ ఫారంలో ఒకే రోజు లక్ష ఉత్పత్తులను అమ్మకం చేయడం ద్వారా గిన్నీస్ రికార్డ్ సాధించడానికి ఆర్‌పీలు గుంటూరు నగరంలో సభ్యులను భాగస్వాములను చేయాలని మెప్మా సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం మెప్మా సీఎంఎంలు, సీఓలు, ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర అభివృద్ధిలో రాబోయే కాలంలో స్వయం సహాయక సంఘాల సభ్యులను భాగస్వాములను చేస్తామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఉపా సెల్ పీడీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

నగర పరిధిలో అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలోనే ఎమినిటి కార్యదర్శులు, ఏఈలు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షణ చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ శుక్రవారం కేవీపీ కాలనీ, నల్లచెరువు, శ్రీనివాసరావుతోట, హనుమాన్‌నగర్, ముత్యాలరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలను గుర్తిస్తే సంబంధిత కార్యదర్శులు, ఏఈలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పర్యటనలో డీఈఈ మధుసూదన్, ఏసీపీ మల్లికార్జున, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆనంద కుమార్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రిగా పని చేసిన దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ మేరకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. తన 38వ ఏట ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యి పిన్న వయసులోనే ఈ ఘనత సాధించిన వ్యక్తిగా చరిత్ర పుటల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఇన్చార్జి సీసీ శ్రీనివాస్, శ్రీహరి రెడ్డి, తెనాలి విజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ భవన్‌లో...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు అన్నారు. రాజీవ్‌గాంధీభవన్‌లో శుక్రవారం మాజీ సీఎం సంజీవయ్య జయంతి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన లింగంశెట్టి మాట్లాడుతూ దళిత నేత సంజీవయ్యను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. నీతి, నిజాయితీలకు నిలువుటద్దం సంజీవయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ కూచిపూడి విజయ, పశ్చిమ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ రాచకొండ జాన్‌బాబు, గడ్డం పాల్‌విజయ్‌కుమార్, బిళ్ళా సునీల్, సయ్యద్ సుభాని, కొండయ్య, బాషా తదితరులున్నారు.



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లింగంశెట్టి, జాన్‌బాబు తదితరులు

దళిత, బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో...

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నిజాయితీకి నిలువుటద్దం దామోదర సంజీవయ్య అని దళిత, బహుజన, ప్రజా సంఘాలు కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా శుక్రవారం లాడ్జీ సెంటర్లో ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పండుగగా ప్రకటన చేయడం హర్షణీయమన్నారు. వృద్ధాప్య పెన్షన్ విధానానికి ఆయన రూపకర్త అని కొనియాడారు. కార్యక్రమానికి వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె జయసుధ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో కోటేశ్వరరావు, నల్లపు నీలాంబరం, వాసు, సముద్రాల చిన్న కోటేశ్వరరావు, డేన్నిస్ రాయ్, నామతోటి ఉదయ శంకర్, కార్యంశెట్టి ఆనంద్ పాల్గొన్నారు.

20న జేకేసీ కళాశాలలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్ స్కిల్స్ పోటీలు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జేకేసీ కళాశాలలో ఈనెల 20న రాష్ట్ర స్థాయి సాఫ్ట్ స్కిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.గోపిచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కళాశాలలో పోస్టర్స్ ఆవిష్కరించారు. కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు భావవ్యక్తీకరణ, బాడీ లాంగ్వేజ్, టీమ్ వర్కు తదితర విభాగాల్లో పోటీ కోసం డమ్ పరేడ్స్ పేరుతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీల్లో డిగ్రీ లేదా ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొనవచ్చునని, ఒక్కో టీమ్‌లో ఇద్దరు విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. ఒక్కో కళాశాల నుంచి మూడు టీములు పాల్గొనవచ్చునని వివరించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులు ఐడీ కార్డు, కళాశాల ప్రిన్సిపాల్ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి పంచుమర్తి నాగసుశీల, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్ తదితరులు పాల్గొంటారని వివరించారు.



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ గోపిచంద్ తదితరులు

మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి : జంగాల

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మిర్చికి గిట్టుబాటు ధర కల్పించి, రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చి రేటు పతనం అవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం క్వింటాకు రూ.25 వేల మద్దతు ధర ఉండాలన్నారు. సోమవారం మిర్చి యార్డును సందర్శిస్తామని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు అర్హులైన పేదలందరికీ పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ దారులకు అనుకూలంగా, సామాన్యులకు వ్యతిరేకంగా ఉందని మండిపడ్డారు. సమావేశంలో మేడా హనుమంతరావు, పచ్చల శివాజీ, ఆకేటి అరుణ్ కుమార్, షేక్ వలి, బందెల నాసర్ జీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జననంపై ఆధ్యాత్మిక ప్రవచనం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సాహితీవేత్త పీఎస్ఆర్ ఆంజనేయప్రసాద్ జయంతి సందర్భంగా భాగవత రస ప్రవచన ప్రసంగ లహరిలో భాగంగా శుక్రవారం శ్రీకృష్ణ జననంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రవచనం చేస్తూ కృష్ణుడు పుట్టిన వృత్తాంతం, చేసిన బాలక్రీడలు అన్నీ లీలామయమైన దివ్య వైభవాలు మాత్రమేనన్నారు. కార్యక్రమాన్ని పి.రవికిషోర్, పి.హైమానంద పర్యవేక్షించారు.

బృందావన్ గార్డెన్స్‌లో చైన్ స్నాచింగ్

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బృందావన్ గార్డెన్స్ నాలుగో లైన్ చివర శుక్రవారం మధ్యాహ్నం చైన్ స్నాచింగ్ జరిగింది. పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు కథనం మేరకు.. బృందావన్ గార్డెన్స్ 4 లైను, ఎడమవైపు చివర టైనీటాట్స్ స్కూలు దగ్గరలో శుక్రవారం మధ్యాహ్నం ఒంగోలు ప్రసన్నలక్ష్మి (52) నడుచుకుంటూ వస్తూ ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని నల్లపూసల గొలుసు, నానుతాడు లాక్కొని పారిపోయాడు. బంగారం సుమారు 40 గ్రాములు ఉంటుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీసీ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి

● మంత్రి సవితకు బీసీ నాయకులు వినతిపత్రం



మంత్రి సవితకు వినతి పత్రం అందజేస్తున్న కేసన శంకరరావు తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సచివాలయంలో మంత్రి ఎస్.సవితకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. హాస్టల్స్ నిర్వహణ కోసం బడ్జెట్ విడుదల చేయాలని, వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, హాస్టల్స్‌లో నాలుగవ తరగతి సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు భవనాల్లో ఉన్న హాస్టల్స్ కోసం సొంత భవనాలు నిర్మించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు దాసరి దయానందరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● ఎంపీపీ ఇంటూరి పద్మావతి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని గుంటూరు రూరల్ మండల ఎంపీపీ ఇంటూరి పద్మావతి అన్నారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో కొత్త తీర్మానాలు చేయడం లేదని, కేవలం గతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మాత్రం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా తాగునీరు, ప్రశుగ్రాసానికి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ దివాస్‌ను ప్రతి గ్రామంలో నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల విస్తరణ అధికారి కే.శ్రీనివాసరావు, ఏవో విద్యాసాగర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

నిస్వార్థ నాయకుడు కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం శుక్రవారం అధ్యాపకులు, ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని జూనియర్ కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో ఆయన విస్తృత ప్రచారం చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ విలువలకు కట్టుబడి అవినీతికి దూరంగా ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించామని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు అన్ని కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అధ్యాపకుల సంఘం నాయకులు కైలాష్‌నాథ్ పాల్గొన్నారు.

అలుగు జంతువులను సంరక్షిద్దాం

● పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) అజయ్‌కుమార్ నాయక్

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అరుదైన పాంగోలిన్(అలుగు జంతువు)లను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్(వైల్డ్ లైఫ్) అజయ్‌కుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పాంగోలిన్ దినోత్సవం సందర్భంగా తూర్పు కనుమల వన్యప్రాణి సొసైటీ సహకారంతో మంగళగిరిలోని అరణ్యభవన్‌లో ఏపీలో భారతీయ పాంగోలిన్ల సంరక్షణపై ప్రాజెక్టు నివేదిక విడుదల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ నాయక్ మాట్లాడుతూ సహజ పురుగుల నియంత్రణ చేసే జంతువులుగా వీటికి పర్యావరణ ప్రాముఖ్యత ఉన్నప్పటికీ వాటి పొలుసులు, మాంసం కోసం నిరంతరం వేటకు గురౌతున్నాయన్నారు. అదనపు పీసీసీఎఫ్‌లు డాక్టర్ శాంతి ప్రియా పాండే, రాహుల్ పాండే మాట్లాడుతూ అలుగు జంతువుల అక్రమ రవాణాని అరికట్టి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు పాల్గొన్నారు



ప్రమాద రహిత డ్రైవర్లను ప్రశంసా పత్రాలతో సత్కరిస్తున్న ఆర్టీవో సత్యనారాయణప్రసాద్, డీపీటీవో రవికాంత్ తదితరులు

సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తోనే అత్యధిక రోడ్డు ప్రమాదాలు

● ఆర్టీవో సత్యనారాయణప్రసాద్

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తోనే ఇటీవల అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ బి సత్యనారాయణప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. డీపీటీవో ఎం.రవికాంత్ అధ్యక్షతన ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సభ శుక్రవారం గుంటూరు-2 డిపో గ్యారేజ్‌లో జరిగింది. ఆర్టీవో మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత లేకపోవటం, మద్యం సేవించి వాహనం నడపటం, అతివేగంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) రవికాంత్ మాట్లాడుతూ ఆర్టీసీలో ఇటీవల అత్యధికశాతం ప్రమాదాలు ద్విచక్రవాహనాల అతివేగం కారణంగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద రహిత డ్రైవింగ్ చేసిన పలువురు డ్రైవర్లకు ఆర్టీవో చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ 3 సీఎంఈ కె.సత్యనారాయణ, పీవో మాలతి, డిపో మేనేజర్లు రామకృష్ణ, అబ్దుల్ సలాం, పలువురు అసోసియేషన్ నాయకులున్నారు.

పని భారం తగ్గించాలని బ్యాంకు ఉద్యోగుల నిరసన

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకులలో పనిచేసే ఉద్యోగులకు పనిభారం తగ్గించాలని గుంటూరు మాడ్యూల్ ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ చీఫ్ రీజినల్ సెక్రటరీ కేఆర్‌వి జయకుమార్ అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నగరపాలెం ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం వద్ద యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి బ్యాంకులలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాక కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. వారానికి 5 రోజుల పనిదినాలు ఉండేలా చూడాలన్నారు. బ్యాంకు ఉద్యోగులకు ఇచ్చే రాయితీలపై పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. గ్రాట్యుటీ సవరించి ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికై మార్చి 24, 25 తేదీలలో తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నిరసనల్లో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.కోటిరెడ్డి, యూఎఫ్‌బీయూ నాయకులు పి.కిషోర్, రవి చంద్రరెడ్డి, సయ్యద్ బాషా, ఎం.రాంబాబు, ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.



నగరపాలెం, ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

ఘనంగా ఎమ్మెల్యే నసీర్ జన్మదిన వేడుకలు



కేక్ తినిపించుకుంటున్న కార్పొరేటర్లు

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ జిల్లా కార్యాలయంలో కార్పొరేటర్ సమత, టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. నగరంలోని దాక్షిణ్య మానసిక వికలాంగుల శిక్షణ సంస్థలో కార్పొరేటర్ యల్లావుల అశోక్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి, స్కూలు విద్యార్థులకు మిఠాయిలు అందజేశారు. టీడీపీ బీసీ నేత వేములకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నెహ్రూనగర్లో కేక్ కట్ చేశారు. రాజకీయాల్లో అనేక ఒత్తిడులు, పోరాటాలను ఎదుర్కొని స్వయం కృషితో ఎదిగిన యువ నాయకుడు నసీర్ అని నేతలు కొనియాడారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు నూకవరపు బాలాజీ, కొమ్మినేని కోటేశ్వరరావు, అరవపల్లి శ్రీనివాస్, యర్రగోపు నాగేశ్వరరావు, శంకర్, హుస్సేన్, అయిశెట్టి శ్రీనివాస్, బలరాం, నాగేశ్వరరావు, గణేశ్, ముకుందరావు, త్రిపుర, నవీన్, ఖాదర్, వెంకట్, ఎం.శ్రీనివాసరావు, ఆంజనేయ ప్రసాద్, ఫిరోజ్, సింధు, సూరే శ్రీను, పోతురాజు చంద్రశేఖర్, పఠాన్ జమీర్, గాలి సతీశ్, బాలాజీ పాల్గొన్నారు.

51వ డివిజన్‌లో...

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ జన్మదిన వేడుకలు 51వ డివిజన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీనగర్‌లోని మాతృశ్రీ వృద్ధాశ్రమంలో కార్పొరేటర్ ముప్పవరపు భారతి ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ భారతి మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తూర్పు నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఎం.ఈ హుస్సేన్, బొంతల సాయి, పొదిలి రమేష్, గోళ్ళ ప్రభాకర్, రాజు, గండికోట బాబు, మాధవరావు, నాయుడు మధు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో సీతారామయ్య హైస్కూల్ విద్యార్థుల విజయకేతనం

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన స్పోర్ట్స్ అండ్ న్యూట్రిషన్ హెల్త్ అసోసియేషన్ వారు స్ప్రింట్స్ మానియా- 2025 బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ వివిధ రకాల పోటీలను నిర్వహించగా శ్రీ పాటిబండ్ల సీతారామయ్య (సీబీఎస్ఈ) విద్యార్థినీ, విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారు. ఐదో తరగతి చదువుతున్న వై.భవాని 50 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం, 8వ తరగతి చదువుతున్న వై భార్గవ్ 50 మీటర్ల హర్డిల్స్ , 50 మీటర్ల పరుగు పందెం, 200 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం, ఎనిమిదో తరగతి చదువుతున్న షేక్ ఉమర్ అలీ, షేక్ అయాజ్, షేక్ మహమ్మద్, డి.దీపక్ 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతి దేవి, కో ఆర్డినేటర్స్ దుర్గా శ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

డీజీపీ గుప్తాకు రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం అభినందనలు

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తాను రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం నాయకులు శుక్రవారం మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి రిటైర్డ్ ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ, పలువురు నాయకులు పుష్పగుచ్ఛం, శాలువాతో డీజీపీ గుప్తాను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ కేవీ నారాయణ, బోయపాటి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

నిధుల్లేకుండా ఏర్పాట్లు ఎలా?



కోటప్పకొండలో నిర్మించిన శివపార్వతులు, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామి భారీ విగ్రహం

- ఈవో లేఖ రాసినా స్పందించని ప్రభుత్వం
- కొండ దిగువున ప్రారంభించని పనులు
- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- ఒక్క దేవస్థానం వద్దే ఏర్పాట్లు ప్రారంభం
- పది రోజుల్లో మహాశివరాత్రి ఉత్సవాలు
- కోటప్పకొండ తిరునాళ్లపై చేతులెత్తేస్తున్న అధికారులు

(కోటప్పకొండ/నరసరావుపేట), ఆంధ్రజ్యోతి)

మహాశివరాత్రి పురస్కరించుకొని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ల దేశ ప్రసిద్ధి. దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తిరునాళ్లకు తరలివస్తారు. తిరునాళ్లలో విస్తృత ఏర్పాట్లు చేయాల్సి ఉంది. 26న తిరునాళ్ల జరగనుంది. అయితే 24 ఏకాదశి నుంచి తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఇంకా 10 రోజులే సమయం ఉన్నా భక్తులకు వసతులు కల్పించే విషయంలో సంబంధిత శాఖల అధికారులు చూద్దాం.. చేద్దాంలే అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. ఒక్క దేవస్థాన ప్రాంగణంలోనే ఏర్పాట్లు జరుగుతున్నాయి. క్యూలైన్ల పనులు దేవస్థానం అధికారులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. కొండ దిగువన ఏర్పాట్ల పనులు ఇంకా ప్రారంభించలేదు.

వెంటనే ప్రారంభించకపోతే..

తిరునాళ్ల ఏర్పాట్లకు నిధుల సమస్య అధికారులను వెంటాడుతోంది. దీంతో ఏర్పాట్లు పనులు చేపట్టే విషయంలో అధికారులు పనులు చేయిస్తే నిధులు ఎలా అన్నట్టుగా వారి తీరు కనిపిస్తోంది. నిధులు ఎలా సమకూర్చుకున్నా తిరునాళ్లకు ఏర్పాట్లు వెనువెంటనే ప్రారంభించకుంటే భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. తిరునాళ్ల ఏర్పాట్లలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలే కీలకం. అవసరమైన రహదారులకు మరమ్మతులు, బారికేడ్లు, విద్యుత్ లైట్ల ఏర్పాట్లు ఆర్అండ్‌బీ శాఖ చేయాల్సి ఉంది. పంచాయతీ రాజ్ శాఖ కోటప్పకొండకు ఉన్న రహదారులకు మరమ్మతులు, కొండ ప్రాంతంలో పారిశుధ్య పనులు చేపట్టాలి. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ తాగు నీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం చేయాలి. ఆయా పనులు ప్రారంభించి ఏకాదశి 24 కల్లా పూర్తి చేయాలి. కొండలో ఉన్న చెరువులను ఇంకా నీటితో నింపలేదు. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. భక్తులకు నీటి సరఫరా చేసేందుకు శంభులింగ చెరువు, ఎర్ర చెరువులను నింపాల్సి ఉంది. అధికారులు చెరువులను యుద్ధప్రాతిపదికన నింపాలి. లేకుంటే తిరునాళ్లలో భక్తులు నీటి ఇబ్బందులను ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

రోడ్ల అభివృద్ధిపై అలసత్వం


కోటప్పకొండ - కొత్తపాలెం రహదారి పునర్నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాల్సి ఉంది. రహదారిని అలానే వదిలేస్తే భక్తుల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగే పరిస్థితి ఉంది. ట్రాఫిక్ మళ్లింపులో కీలకంగా ఉన్న చిలకలూరిపేట మేజర్ కాలువ రహదారిలో ఏర్పడిన గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలి. ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఘాట్ రోడ్డు మార్జిన్ ప్రమాదకరంగా ఉంది. అటవీ శాఖ నిర్వహణలో ఉన్న ఘాట్ రోడ్డు మార్జిన్‌ను అభివృద్ధి చేసే అంశంపై అలసత్వం నెలకొంది. కొండకు ఉన్న రహదారులలో ఏర్పడిన గోతులను పూడ్చే పనులు చేపట్టకపోతే భక్తుల వాహనాల రాకపోకలకు ఇక్కట్లు తప్పవు.

వేర్వేరుగా క్యూలైన్లు..


కొండపైన దేవస్థానం ప్రాంగణంలో తిరునాళ్ల ఏర్పాట్ల పనులు ప్రారంభమయ్యాయి. క్యూలైన్‌ల నిర్మాణం జరుగుతుంది. వీవీఐపీ, వీఐపీలకు వేర్వేరుగా క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. శీఘ్రదర్శనం, ఉచిత దర్శనం, అభిషేకంకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల విశ్రాంతి కోసం దేవస్థాన ప్రాంగణంలో షామీయానాలు ఏర్పాటు చేస్తున్నారు. అరిసే, లడ్డూ ప్రసాదం తయారి జరుగుతుంది.

శివపార్వతుల భారీ విగ్రహ నిర్మాణం

కోటప్పకొండలో నరసరావుపేట రహదారిలో చిలకలూరిపేట మేజర్ కాలువ సమీపంలో శివపార్వతి.. విఘ్నేశ్వరుడు.. సుబ్రమణ్యం స్వామి భారీ విగ్రహంను నిర్మించారు. 2023లో నిర్మాణం చేపట్టారు. సుమారు రూ. 1.43 కోట్ల వ్యయంతో నిర్మించారు. నిర్మాణ పనులు పూర్తయ్యాయి. భక్తులు దర్శించుకునేలా విగ్రహం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.




గోనేపూడి రహదారి దుస్థితి



ఇంకా నీటితో నింపని శంభులింగ చెరువు



క్యూలైన్‌లు పరిశీలిస్తున్న దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి నాగవినయ్‌చంద్



అనందవల్లి దేవాలయం వద్ద ఆర్చికి రంగులు వేస్తున్న దృశ్యం

ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటికి తిరునాళ్ల బాధ్యతలు

తిరుపతిలో తొక్కిసలాట సంఘటన జరిగిన నేపథ్యంలో కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్ల విషయంలో ప్రభుత్వం ఉన్నతాధికారులను అప్రమత్తం చేస్తోంది. తిరునాళ్ల బాధ్యతలను నలుగురు ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం అప్పగించింది. జిల్లా ఇన్‌చార్జ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబులకు అప్పగించారు. వీరు ఇప్పటికే ఒక మారు కోటప్పకొండలో పర్యటించి భక్తులకు కోసం చేపట్టాల్సి ఏర్పాట్లపై సమీక్షించారు. విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని, పనులు వేగవంతం చేయాలని వారు కోరినప్పటికీ అధికారులు మాత్రం ఇంకా ఏర్పాట్లు ప్రారంభించకపోవడం గమనార్హం.

నిధుల ఊసెత్తని ప్రభుత్వం

తిరునాళ్ల ఏర్పాట్లకు ప్రభుత్వం ఇంకా నిధులు విడుదల చేయలేదు. దేవస్థానం ఈవో నిధుల కోసం లేఖ రాశారు. దీనిపై ఇంకా దేవదాయ శాఖ స్పందించలేదు. దేవస్థానం వద్ద భక్తుల కోసం చేసే ఏర్పాట్లకు రూ.30లక్షల నిధులు విడుదల చేయాలని, గత ఏడేళ్లుగా నిలిచిపోయిన నిధులను కూడా విడు దల చేయాలని లేఖ ద్వారా ఈవో కోరారు. కొండ దిగువన భక్తుల కోసం ఏర్పాట్లకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరుకాలేదని అధికారులు చెబుతున్నారు. వందలాది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారు. వీరికి భోజనవసతి పోలీసు శాఖ సొంతంగా సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. భక్తుల విరాళాలపై పోలీసు శాఖ ఆధారపడాల్సి వస్తుంది. ఇదే పరిస్థితిని ఏర్పాట్ల విషయంతో ఇతర శాఖలు కూడా ఎదుర్కొంటున్నాయి.

భక్తులు సంతోషంగా వెళ్లాలి : దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి

దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి నాగవినయ్‌చంద్ తిరునాళ్ల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. భక్తులు త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని సంతోషంగా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సరఫరా, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. శానిటేషన్ పనులకు సిబ్బందిని మూడు షిఫ్టులు ఏర్పాటుచేయాలని సూచించారు. ఎవరైనా విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రసాదం కొరత లేకుండా చూడాలని, గతేడాది కంటే తయారీ పెంచాలన్నారు. దేవస్థానంలో ఏర్పాటుచేస్తున్న కూలైన్‌లు, అభిషేక మండపాన్ని ఆయన పరిశీలించారు. వినయ్‌చంద్ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు, ఆర్డీవో మధులత, ఈవో టి.సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగేదాక స్పందించరా!



చిన్న తప్పిదం వలన పెద్ద ప్రమాదాలు జరుగుతాయి. నిత్యం వేలాది మందితో రద్దీగా ఉండే గుంటూరు మిర్చి యార్డులో మ్యాన్ హోల్స్ అన్నీ తెరిచే ఉన్నా, అక్కడి అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. దాని మీద నుంచే ఎంతోమంది అటూ ఇటూ తిరుగుతూ ఉన్నారు. పొరపాటున కాలు అందులో వేస్తే అంతే సంగతులు. కనీసం ఇప్పుడైనా అధికారులు స్పందిస్తే జరగబోయే పెను ప్రమాదం తప్పుతుంది.

(ఆంధ్రజ్యోతి, గుంటూరు)

బాల్యం.. వ్యర్థం



తిరుగుతూ వ్యర్థాలు పోగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. బడిబాట పట్టాల్సిన ఈ చిన్నారుల జీవితం వ్యర్థాలతో రోడ్ల మధ్యనే గడిచి పోతోంది. స్థానిక నరసరావుపేట రోడ్డులోని మిర్చియార్డు సమీపంలో పనికిరాని బాటిల్స్, ఇనుప వ్యర్థాలు ఏరుకుంటూ బాలలు ఇలా రోడ్లపై తిరుగుతున్నారు. బాల కార్మికుల నిర్మూలన కోసం ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా అవి వారి దరికి చేరడం లేదు. బడిలో ఉండాల్సిన బాలలు బజారులో తిరుగుతూ... బాల కార్మికుల సంరక్షణ కోసం పనిచేస్తున్న యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు ఏమయ్యాయో సంబంధిత అధికారులకే తెలియాలి.

- (గుంటూరు, ఆంధ్రజ్యోతి)



ఇటీవల సీసీ కెమెరాలో కనిపించిన పులులు

విజయపురిసౌత్ రేంజ్ పరిధిలో 5 పులుల గుర్తింపు

- వైల్డ్‌లైఫ్ రేంజర్ సుజాత

వెల్దుర్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విజయపురిసౌత్ వైల్డ్‌లైఫ్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో 5 పులులను గుర్తించినట్లు వైల్డ్‌లైఫ్ ఫారెస్ట్ రేంజర్ సుజాత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పులుల లెక్కింపు పూర్తయిందనీ, రేంజ్ పరిధిలో ఒక ఆడ, ఒక మగ పులులతోపాటు మూడు పులి పిల్లలు ఉన్నట్లు చెప్పారు. అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వీటి జాడను గుర్తించినట్లు తెలిపారు. ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన గేట్లను దాటి ఎవరూ లోపలకు వెళ్లకూడదని సూచించారు. వేసవి దృష్ట్యా అడవిలో నీటి ఎద్దడి ఉంటుందనీ, పులులు గ్రామ సమీపాల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అటవీ ప్రాంత సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా ఇప్పటికే అడవిలో సాసర్‌పిట్లు (నీటి కుంటలు) ఏర్పాటు చేసి ట్యాంకుల ద్వారా నీటిని నింపుతున్నామన్నారు.

సీఆర్డీఏకు సవాలు



సీఆర్డీఏ కార్యాలయం ముందు గుంతలు పూడ్చేందుకు తోలిన మట్టి

(5వ పేజీ తరువాయి)

సారించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు 2019కి ముందు నిర్మించిన భవనాల పరిస్థితిని తెలుసుకోవడానికి రాజధానిలో పర్యటించారు. కిందటేడాది అక్టోబరు 20న జరిగిన ఆ పర్యటనలోనే ఆయన సీఆర్డీఏ భవన నిర్మాణాల పనులను పునః ప్రారంభించారు. మరో రెండు నెలల్లో సీఆర్డీఏ కార్యాలయం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ మాట చెప్పి ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్నది. అయితే ఇప్పటికీ పనులు ముందుకు సాగలేదు. జగన్ హయాంలో చేపట్టిన నిర్మాణాలను తొలగించి, మాస్టర్‌ప్లాన్ ప్రకారం రూపొందించిన నమూనాను తీసుకురావడమే ప్రభుత్వానికి సవాలుగా మారింది. నాలుగు నెలలుగా అస్తవ్యస్త నిర్మాణాలను తొలగించడం, కార్యాలయం చుట్టూ ఉన్న ప్రాంగణాన్ని శుభ్రం చేయడానికే సమయం సరిపోతోంది. రాజధానిలో ఏర్పాటు చేస్తే అమరావతి నిర్మాణ పనులు మరింతగా పుంజుకుంటాయి. ప్రస్తుతం విజయవాడ నుంచి రాజధాని పనులను పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో నిర్ణయాలు, వాటి అమలులో తెలియకుండానే జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తక్షణం కార్యాలయం అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది. అయితే పనులు మాత్రం అనుకున్నంత వేగంగా జరగడం లేదు. ముందుగా వేసిన అంచనాలను మించి అదనంగా వ్యయం చేయాల్సి వస్తోంది.



సీఆర్డీఏ కార్యాలయం పనుల నిమిత్తం తెచ్చిన రెడీ మిక్స్ యంత్రం

తాత్కాలిక ప్లాట్స్ కేటాయింపులో అక్రమాలు

- 50 శాతం ఆదాయం కోల్పోయిన మిర్చియార్డు
- విచారణ జరిపితే ఆదాయం పెరిగే అవకాశం

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో ప్రస్తుత సీజన్‌కు తాత్కాలిక ప్లాట్ల కేటాయింపులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రికార్డుల్లో నమోదు చేసిన అద్దెల కంటే రెట్టింపు వసూలు చేశారన్న విషయం యార్డులో గుప్పుమంటున్నది. దీనివలన మార్కెట్ కమిటీకి రావాల్సిన ఆదాయానికి భారీగానే గండి పడింది. దాదాపుగా 86 ప్లాట్లను తాత్కాలిక ప్రాతిపదికన కమీషన్ వ్యాపారస్తులకు కేటాయించారు. ఒక్కో షాపు వైశాల్యం 400 నుంచి 800 చదరపు మీటర్ల వరకు ఉంది. ఒక్కో చదరపు మీటర్‌కు అధికారికంగా రూ. 25 మాత్రమే వసూలు చేసినట్లు రికార్డుల్లో చూపించారు. అయితే గుట్టుచప్పుడు కాకుండా రెట్టింపు మొత్తాన్ని వసూలు చేసి పంచేసుకొన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. దీనిపై విచారణ జరిగితే మరో కుంభకోణం వెలుగు చూసే అవకాశం ఉన్నది.

దాదాపుగా రూ.47 లక్షల వరకు ఆదాయం రావాలి

ఏటా మిర్చి సీజన్‌లో జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెల మొదటి వారం వరకు తాత్కాలిక ప్లాట్లను వ్యాపారస్తులకు కేటాయిస్తారు. సీజన్‌లో ఎక్కువ మొత్తంలో బిజినెస్ చేసే వ్యాపారస్తులు వీటిని తీసుకొంటారు. ఈ ప్లాట్ల కేటాయింపు బహిరంగ వేలం ద్వారా జరపాలి. అయితే ఈ దఫా గుట్టుచప్పుడు కాకుండా పూర్తి చేశారు. ఈ క్రమంలో పెద్దఎత్తున నగదు చేతులు మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో ప్లాటు సగటు విస్తీర్ణం 550 చదరపు మీటర్ల వంతున లెక్కిస్తే రూ. 13,750 ఆదాయం రావాలి. ఈ గణాంకాలను లెక్కిస్తే యార్డుకు దాదాపుగా రూ. 47 లక్షల వరకు ఆదాయం రావాల్సి ఉన్నది. అయితే ఇందులో సగం కూడా రాలేదని సమాచారం.

విజిలెన్స్‌కు ఫిర్యాదులు..

దీనిపై విజిలెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఇప్పటికే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సమగ్ర నివేదికని ప్రభుత్వానికి అందజేసింది. ఇప్పుడు నెలన్నర క్రితం జరిగిన మరో అవినీతిపై ఆరోపణలు రావడంతో మళ్లీ విచారణ జరిపే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ కూడా టెంపరరీ ప్లాట్ల కేటాయింపులో యార్డుకు జరిగిన నష్టంపై ఆరా తీస్తున్నది.

కృత్రిమ మేధపై పరిజ్ఞానం అవసరం

- వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నేటి సాంకేతిక యుగంలో ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతున్న కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ప్రయోజనాలు, ప్రమాదాలపై విద్యార్థులు విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. సదస్సు ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య మాట్లాడుతూ ఈ సదస్సు విద్యార్థుల విజ్ఞానానికి ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. మైక్రోసాఫ్ట్ సంస్థకు చెందిన ఏఐ డేటా ప్రత్యేక ప్రతినిధి శేఖర్ రాజు మాట్లాడుతూ కృత్రిమ మేధను మానవ అద్భుతసృష్టిగా భావించేవారు కొందరైతే, సాంకేతిక సమస్యగా చూసే వారు కొందరని అన్నారు. క్వాడెంట్ టెక్నాలజీస్ సేల్స్ మేనేజర్ ఆర్.రవి, మైక్రోసాఫ్ట్ టెక్ సేల్స్ సౌత్ ఇండియా ప్రతినిధి శ్రీకాంత్ కురూప్, అస్యూర్ సొల్యూషన్స్ ప్రత్యేక ప్రతినిధి అన్షుమాన్ అగర్వాల్, డాక్టర్ వేమూరి రవి, ఐమర్ సొసైటీ ఇండియన్ సర్వర్స్ సీఈవో డి.సాయిసతీష్ విద్యార్థులకు కృత్రిమ మేధకు సంబంధించిన అంశాలను తెలియజేశారు. ఈ వర్క్‌షాప్‌లో కంప్యూటర్ సైన్స్ ,ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ జి. నీలిమ, డాక్టర్ యు.సూర్య కామేశ్వరి, డాక్టర్ ఆర్.వసంత, పుష్పలత, బసవేశ్వరరావు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె. గంగాధరరావు

మోసగించిన వారికి అండగా ఉండొద్దు

- వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సెక్రెటరి చంద్రిక



మిర్చి కమీషన్ వ్యాపారస్తులతో సమావేశమైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శిచంద్రిక

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులను మోసగించిన కమీషన్, ఎగుమతి వ్యాపారస్తులకు ఎవరూ అండగా నిలవొద్దని వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఏఎంసీ పరిపాలన భవనంలో కమీషన్ వ్యాపారస్తుల సంఘం నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రెటరీ చంద్రిక మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొంతమంది వ్యాపారస్తులు రైతుల మిర్చిని అమ్మేసి వారికి డబ్బులు చెల్లించకుండా బోర్డులు తిప్పేశారన్నారు. అలాంటి వారి లైసెన్సులను తాము నిలుపుదల చేశామని చెప్పారు. అయితే కొంతమంది వ్యాపారస్తులు వాళ్ల పేరుతో బిల్ టూ బిల్ వ్యాపారం చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో జాయింట్ కలెక్టర్ చాలా సీరియస్‌గా ఉన్నారని చెప్పారు. అలానే మిర్చి ధర పెరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉదయం వేలం సమయంలో ఒక ధర, బిడ్డింగ్ అయిన తర్వాత మరో ధర ఇస్తామని చెప్పొద్దని, అలా చేస్తే సంబంధిత వ్యాపారిపై చర్యలు చేపడతామన్నారు. వ్యాపారస్తులు సిండికేట్ అయి ధర పెరగకుండా చేయాలని చూడొద్దని, రైతులకు న్యాయంగా రావాల్సిన ధర వచ్చేలా చూడాలన్నారు. మచ్చుకాయలు నేటికీ చాలామంది తీస్తున్నారని, దానిని పూర్తిగా అరికట్టాలన్నారు. యార్డులో ట్రాఫిక్ స్తంభించిపోకుండా అన్ని గేట్లు తెరిచామన్నారు. కొంతమంది ధూమపానం చేస్తున్నారని, అలాంటి వారిని నిరోధించాలన్నారు. తాము సోడా బంకులపై దాడులు నిర్వహించి సిగరెట్లు, అగ్గిపెట్టెలు, లైటర్లు సీజ్ చేశామన్నారు. సమావేశంలో స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ సుబ్రహ్మణ్యం, మిర్చి కమీషన్ వ్యాపారస్తుల సంఘం నాయకులు దాది నరేంద్రబాబు, జంగా నర్సిరెడ్డి, ముక్కాల విజయభాస్కర్‌రెడ్డి, ఎల్.అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వారాంత రద్దీ దృష్ట్యా ఈ నెల 21, 22 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07025 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు రైలు ఈ నెల 21వ తేదీన రాత్రి 9.15కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు మధ్యాహ్నం 12.15కి శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు 07026 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి రైలు ఈ నెల 22వ తేదీన మధ్యాహ్నం 2.15కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

రూ.50 వేలకు మించి ఉండరాదు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా సరైన ఆధారాలు లేకుండా ఎవరూ రూ.50 వేలకు మించి నగదు కలిగి ఉండరాదని రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిమితికి మించి నగదు తీసుకొని వెళితే ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన కింద ఆ నగదుని జప్తు చేస్తామన్నారు. అలానే అనుమతి, ఆధారం లేకుండా బంగారం, వెండి వంటి ఆభరణాలు, ఎన్నికల ప్రచార సామగ్రి, ఓటర్లను ప్రలోభ పెట్టే ఏ ఇతర సామగ్రి రవాణ చేయరాదన్నారు. అలా చేస్తే వాహనాల అనుమతులు రద్దు చేసి కేసులు పెడతామని హెచ్చరించారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 1818 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1818 క్యూసెక్కుల సాగునీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.9 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 80, రేపల్లె కాల్వకు 196, తూర్పు కాల్వకు 330, పశ్చిమ కాల్వకు 125, నిజాంపట్నం కాల్వకు 115, కొమ్మమూరుకాల్వకు 366 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

758 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 758 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,001 గరిష్ఠధర రూ.11,000 మోడల్‌ధర రూ.10,650 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,200, గరిష్ఠధర రూ.11,000 మోడల్‌ధర రూ.10,800 పలికాయి.

స్కూటీ నుంచి జారిపడ్డ బ్యాగు

● 2.30 లక్షల నగదు మాయం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఓ ఉద్యోగి స్కూటీకి బ్యాగు తగిలించుకుని వస్తున్న క్రమంలో అది జారిపడటంతో అందులో ఉన్న 2.30 లక్షల రూపాయల నగదు మాయమైన ఘటన మండలపరిధిలోని గొట్టిపాడు రోడ్డులో జరిగింది. గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న చల్లమ్మకు గొట్టిపాడులోని సెంట్రల్ బ్యాంకులో అకౌంటు ఉంది. శుక్రవారం నాడు బంగారం తాకట్టుపెట్టి వైద్య ఖర్చుల నిమ్తితం రూ.2.30లక్షల నగదును తీసుకుని ఇంటికి బయలుదేరింది. అయితే గతుకుల రోడ్డు కావడంతో దారి మధ్యలో బ్యాగు జారి పడింది. ప్రత్తిపాడు వచ్చిన తరువాత బ్యాగు లేదని గుర్తించిన ఆమె తిరిగి బ్యాగును వెతుక్కుంటూ గొట్టిపాడు వైపు వెళ్లింది. అయితే ఎక్కడా కనిపించక పోవడంతో పోలీసులను ఆశ్రయించింది.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

తాడికొండ(బేజాత్‌పురం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మృతదేహంను బేజాత్‌పురంలో స్థానికులు శుక్రవారం గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బేజాత్‌పురం గ్రామంలోని పంట పొలాల్లో సుమారు 70 సంవత్సరాలు వయస్సు కలిగిన వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వృద్ధురాలు లేత బులుగు రంగు జాకెట్టు, లేత పచ్చ రంగు చీర, నలుపు రంగు చాయ, తెల్లజుట్టు కలిగి ఉందని పోలీసులు తెలిపారు. వీఆర్‌వో రవిబాబు ఫిర్యాదు ఇవ్వటంతో కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు తాడికొండ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ జిత్యా నాయక్ తెలిపారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

తాడికొండ (బేజాత్‌పురం), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మతి స్థిమితం లేని వృద్ధుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన ఘటన శుక్రవారం బేజాత్‌పురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గాలంకి జ్ఞానసుందరం(85)కు కొంత కాలంగా మతి స్థిమితం లేదు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లిన జ్ఞానసుందరం ఎంత సేపటికి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు మృతుడి కోసం గాలించగా గ్రామంలోని ఓ బావిలో పడినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ బస్సు దగ్ధం

తుళ్లూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ బస్సులో షార్ట్‌సర్క్యూట్‌తో జరగటంతో కాలిపోయింది. సకాలంలో డ్రైవర్ గుర్తించటంతో ప్రాణాపాయం నుంచి బస్సులోని స్టాఫ్ బయటపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం మంగళగిరి మండలంలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ బస్సు స్టాఫ్‌తో వెళుతున్న క్రమంలో శుక్రవారం రాత్రి 8గంటల సమయంలో నెక్కల్లు అనంతవరం రోడ్డులో మంటలు చెలరేగాయి. వెంటనే బస్సు ఇంజన్ నిలిపివేసి డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. లోపల 15 మంది వరకు ఉన్న సిబ్బంది బయట పడ్డారు. బస్సు పాక్షికంగా కాలిపోయినట్టు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. ఎటువంటి ప్రాణాపాయం లేదన్నారు. తమ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా శివబాబా పుట్టినరోజు వేడుకలు

మంగళగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఆత్మకూరులోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శివబాబా 89వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం జెండాను ఆవిష్కరించి కేకును కట్ చేశారు. శివ బాబా చూపిన విధంగా ప్రతిఒక్కరూ ప్రేమను పంచుతూ జ్ఞానం పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు, ఆశీర్వాదం, హనుమంతు, విజయభాస్కర్, విశ్వ విద్యాలయం వరంగల్ సబ్‌జోన్ ఇన్‌చార్జి బీకే సవిత, విజయవాడ సబ్‌జోన్ ఇన్‌చార్జి బీకే శాంత పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో స్నాతకోత్సవం

మంగళగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రవీంద్రభారతి పాఠశాలలో యూ కేజీ విద్యార్థుల స్నాతకోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ విజిలెన్స్ ఆఫీసర్ కే.రామప్రసన్న ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల్లో మానవీయ విలువలు పెంపొందింపజేయాలని చెప్పారు.

ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలి

● కూటమి నేతలు



మంగళగిరిలో గ్రాడ్యుయేట్లను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న కూటమి నేతలు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులందరూ మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్య ఓటును వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆలపాటి గెలుపు కోసం కూటమి నాయకులు మంగళగిరి పట్టణంలో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ద్వారకానగర్‌లోని చైతన్య స్కూల్, వీవర్సు కాలనీలోని మున్సిపల్ హైస్కూల్, సీకే హైస్కూల్, వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పర్వతం మధుసూదనరావు, మునగపాటి మారుతీరావు, తుల్లిమిల్లి రామకృష్ణ, మన్నెం రమేష్‌బాబు, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, వాకా మాధవరావు, జొన్నాదుల బాలకృష్ణ, నాగేశ్వరరావు, కాండ్రు భానుకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ మంగళగిరి శ్రామికనగర్, సూర్యనారాయణ నగర్‌లో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, నేతలు పడవల మహేష్, వంగర రమేష్, చిలకా శ్రీధర్, గంటా దుర్గాప్రసాద్, గుంటి ప్రతాప్ తదితరులు ప్రచారం నిర్వహించారు.

● **తాడేపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి):** కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం తాడేపల్లిలో 17, 18 సచివాలయాల పరిధిలో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. తాడేపల్లిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ ఆలపాటిని గెలిపించాలని గ్రాడ్యుయేట్ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మడి సత్యనారాయణ పాల్గొన్నారు.

● **పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి):** గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి ప్రభుత్వం బలపరిచిన ఆలపాటి రాజా గెలుపుకు కృషి చేద్దామని టీడీపీ మండల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రులంతా తమ మొదటి ప్రాధాన్య ఓటు ఆలపాటికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగురైతు కార్యదర్శి మోపర్తి చెంచయ్య, మండల సర్పంచుల సంఘ మాజీ అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు చాగంటి సత్యహర్ష, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, నాయకులు బత్తిని వేణు, మదమంచి వాసు, అద్దంకి శివన్నారాయణ, గ్రామ అధ్యక్షులు బండి నాగబాబు, నల్లూరి అంకమ్మచౌదరి, రమేష్, పెద్ది రమేష్, కొల్లా హరిబాబు, నెట్టెం గోపాలరావు, ప్రత్తిపాటి రవీంద్ర, బండారు రాంబాబు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామిక వేత్తలను చేయడమే లక్ష్యం

● రూ.4కోట్లతో ప్లాటెడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థల పరిశీలన ● జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి



ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

దుగ్గిరాల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలందరినీ పారిశ్రామిక వేత్తలను చేయడమే లక్ష్యంగా పారిశ్రామిక కేంద్రం (ప్లాటెడ్ కాంప్లెక్స్ ఫ్యాక్టరీ) ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ టీ విజయలక్ష్మి చెప్పారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయానికి శుక్రవారం వచ్చిన పీడీ విజయలక్ష్మి అధికారులతో సమీక్షించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో డ్వాక్రా మహిళలందరూ అన్ని ఉత్పత్తులను తయారు చేసేందుకు తగిన వసతులను కల్పించి అవసరమైన శిక్షణ కూడా ఇవ్వనున్నామన్నారు. ప్రతిమహిళా వ్యక్తిగతంగా కూడా స్వయం సమృద్ధి సాధించేలా పలురకాల ఉత్పత్తుల తయారీకై శిక్షణ ఇస్తామన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరమైన విద్యుత్ సౌకర్యం, నీరు తదితర వసతులన్నీ ఒకే చోట ఉండేలా స్థలాన్ని కూడా సిద్ధం చేసి త్వరలో ప్రారంభిచనున్నామని అన్నారు. సభ్యుల వద్ద నామమాత్ర రుసుంను తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో రూ.4కోట్ల పెట్టుబడితో ప్లాటెడ్ కాంప్లెక్స్ ఫ్యాక్టరీలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. స్థలం కోసం తహసీల్దార్ ఐ సునీతతో మాట్లాడామని, సానుకూలంగా స్పందించారన్నారు.

రైతులందరూ యూనిక్ ఐడీ కోసం రిజిష్టర్ చేయించుకోవాలి

● ఏవో నాగరాజు

మేడికొండూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య(యూనిక్ ఐడీ) కోసం రిజిష్టర్ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎం నాగరాజు శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ఫార్మర్ రిజిష్టర్ పోర్టల్ ద్వారా రైతులందరికీ 11 అంకెలు గల విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ నెంబర్) ఇస్తున్నందున ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కు అనుసంధానం అయిన ఫోన్ నెంబర్‌తో మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి నమోదు చేయించుకోవాలని సూచించారు. సొంత భూమి కలిగిన రైతులు తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని ఏవో తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు నివాళి



సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి లోకేశ్, మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

మంగళగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన సంజీవయ్య తన పదవీ కాలంలో అనేక విప్లవాత్మకమైన పథకాలతో ప్రజల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. నమ్మిన విలువల కోసం జీవితాంతం కట్టుబడిన దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. సంజీవయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

● **తాడేపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి):** తాడేపల్లి ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఘనంగా నివాళులర్పించారు. అనేక విప్లవాత్మక పథకాలతో ప్రజల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారన్నారు. నమ్మిన విలువలకు జీవితాంతం కట్టుబడిన వ్యక్తి అని ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఉండవల్లి శ్రీదేవి వ్యాఖ్యానించారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్‌తనిఖీలు

● రూ.4.26 లక్షల అపరాధ రుసుం

● ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం వారు, సీఆర్‌డీఏ పర్యవేక్షణ ఇంజనీరు పీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వట్టిచెరుకూరు సెక్షన్‌లోని చింతపల్లిపాడు, కుర్నూతల, గారపాడు, కొర్నెపాడు, వింజనంపాడు గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. ఆయా వినియోగ దారులకు చెందిన 2726 సర్వీసు మీటర్లు తనిఖీ చేసి వివిధ పద్ధతుల్లో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారికి రూ.4.26 లక్షల అపరాధ రుసుం విధించినట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సీహెచ్ వెంకటేశ్వరరావు, డీఈఈ, ఆపరేషన్ ఏఈ సీహెచ్ రమేష్‌లు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన నలుగురికి రూ.62వేలు, అనుమతించిన క్యాటగిరి కాక ఇతర క్యాటగిరిలలో విద్యుత్ వాడుతున్న ఇద్దరి నుంచి రూ.15వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 67 మందికి రూ.2.97 లక్షలు, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన సర్వీసు యజమానికి రూ.50వేలు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో 34 మంది అధికారులు, 102 మంది సిబ్బంది 34 బృందాలుగా ఏర్పడి సర్వీసులను తనిఖీ చేసినట్టు వివరించారు. దాడుల్లో డీఈఈ ఎన్ ఎం ప్రసాదు, ఏ గురునాథరావు, ఏఈలు సతీష్‌కుమార్, శివశంకర్, ఆపరేషన్ ఏఈ జీ రవి తేజ, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పెదపాలెంలో లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం



పెదపాలెంలో పట్టభద్రులకు కరపత్రాలను అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

దుగ్గిరాల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలెం, గొడవర్రు, పేరుకలపూడి, వీర్లపాలెం గ్రామాల్లో ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ పోటీ చేస్తున్న కఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం జరిపిన లక్ష్మణరావును గెలిపించాలంటూ గ్రామంలోని పట్టభద్రులను కలిసి కరపత్రాలను అందించి ఓటను అభ్యర్థించారు. వ్యవసాయ కార్మికసంఘ జిల్లా కార్యదర్శి జెట్టి బాలరాజు, ఏమినేని స్టాలిన్, ఎం ఏసుపాదం, ఎస్ ప్రవీణ్, ఎం కోటేశ్వరరావు, పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

● **మంగళగిరి సిటీ (ఆంధ్రజ్యోతి):** పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలోని భార్గవపేటలో ప్రజా సంఘాల నేతలు ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి గ్రాడ్యుయేట్లను కలిసి ఓట్లను అభ్యర్థించారు. మొదటి ప్రాధాన్య ఓటును లక్ష్మణరావుకు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు రాఘవులు, బాలాజీ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీఐటీలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



వీఐటీలో బిజినెస్ ప్రాక్టీస్ ఇన్ డిజిటల్ ఎరా ప్రొసీడింగ్స్ ఆవిష్కరిస్తున్న వివిధ దేశాల యూనివర్శిటీల ప్రొఫెసర్లు

తుళ్లూరు(ఐనవోలు), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయంలో ఇన్నోవేషన్ సస్టైనబుల్ బిజినెస్ ప్రాక్టీసెస్ ఇన్ డిజిటల్ ఎరాపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. వీఐటీ, న్యూకాజిల్ విశ్వవిద్యాలయం (ఆస్ట్రేలియా), హెరియట్ - వాట్ విశ్వవిద్యాలయం (యూకే), బర్మింగ్ హామ్ సిటీ విశ్వవిద్యాలయం (యూకే)సంయుక్త సహకారంతో జరగుతుందని వీఐటీ పేర్కొనింది. నేటి డిజిటల్ యుగంలో ఇన్నోవేషన్, సుస్థిరత లక్ష్యాలపై కీలక ప్రసంగాలు, ప్యానెల్ చర్చలు, సాంకేతిక సెషన్, ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహిస్తారని తెలిపింది. సృజనాత్మకత ప్రాముఖ్యం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులలో అవగాహన పెంచడమే ఈ సదస్సు ముఖ్యఉద్దేశమని వీఐటీ పేర్కొంది. ఈ అంతర్జాతీయ సదస్సులో 11 టెక్నికల్ సెషన్స్‌లో మొత్తం 128 పేపర్లు సమర్పించారు. ముఖ్యఅతిథి ప్రవాకర్ సాహు (సీనియర్ సలహాదారు- ఆర్థిక శాస్త్రవేత్త ఆర్థిక శాఖ, నీతి అయోగ్, భారత ప్రభుత్వం) మట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రాన్ని ఎస్ 2.4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించిన ఏపీ ప్రభుత్వం దార్శనిక విధానం స్వర్ణాంధ్రకు భారత ప్రభుత్వం పూర్తి మద్దతు ఇచ్చిందని వివరించారు. వీఐటీ వైస్ ఛాన్సలర్ కోటారెడ్డి మాట్లాడుతూ అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో చేసుకున్న ఎంవోయూలు విశ్వవిద్యాయానికి తలమాణికమని ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లోని యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు నిధులను కూడా అందజేస్తున్నామని, వీఐటీలోని ప్రతి విద్యార్థి అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. గౌరవఅతిథి ప్రొఫెసర్ డాక్టర్ ఫ్రాన్సిస్కో పోలూచి ప్రసంగించారు. ఈ సదస్సులో వీఐటీ- విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జగదీష్ ముదింటి, రీసెర్చ్ డీన్ రవీంద్ర, అసోసియేట్ డీన్‌రాఘువేంద్ర, అస్రార్ అహ్మద్, సుహైల్, మొహ్మమద్, అబ్దుల్ము ఖీత్ మాజ్, పలు విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిర్చికి మద్దతు ధర క్వింటాల్‌కి రూ.20వేలు ప్రకటించాలి

పెదనంపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మిర్చికి మద్దతు ధర క్వింటాకు రూ.20వేలు ప్రకటించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ కాలువ, గుంటూరుఛానెల్‌కు సాగునీరు నిలుపుదల చేయడంతో ఆయుకట్టు ప్రాంత పంటలు ఎండుముఖం పడుతున్నాయని, నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేఎల్‌యూ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ రాజశేఖరరావు

తాడేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సమైక్యతా శిబిరానికి కేఎల్ యూనివర్సిటి నుంచి హాజరైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు యూనివర్సిటి యాజమాన్యం, అధ్యాపకులు శుక్రవారం అభినందనలు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌లోని వైఎస్ కళాశాలలో ఏడు రోజులపాటు జరిగిన జాతీయ స్థాయి సమైక్యతా శిబిరానికి శాస్త్రీయ నృత్య విభాగం నుంచి నందిని, సంస్కృతీ సంప్రదాయాల విభాగం నుంచి సాయిచైతన్య, హాజరయ్యారని, ఇన్‌చార్జి వీసీ రాజశేఖరరావు వారిని అభినందించారు.

నేడు భావనారుషి స్వామి కల్యాణం

● హాజరుకానున్న మంత్రి నారా లోకేశ్



పెండ్లి కుమారుడిగా దర్శనమిచ్చిన భావనారుషి స్వామి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని దామర్ల నాంచారమ్మ ప్రాంగణంలో ఉన్న శ్రీభద్రావతీ సమేత భావనారుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవం శనివారం ఉదయం జరుగనుంది. ఉత్సవాల్లో భాగంగా స్థానిక రెండు రామమందిరాల వద్ద వేంచేసియున్న స్వామివార్ల మూలవిరాట్లకు శుక్రవారం ఉదయం అభిషేకం నిర్వహించి, పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ ఉత్సవానికి డాక్టర్ తాడిపర్తి మురళీ వెంకటేశ్వరరావు, విజయభారతి దంపతులు, డాక్టర్ తాడిపర్తి శ్రీనివాసమూర్తి దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. కల్యాణ మహోత్సవం అనంతరం ఆదివారం రాత్రి పులి వాహనంపై జరిగే స్వామివార్ల గ్రామోత్సవానికి రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ బహూత్తమ సంఘం అధ్యక్షుడు చింతకింది కనకయ్య, ఉపాధ్యక్షుడు గుత్తికొండ ధనుంజయరావు, ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేరస్వామి, కోశాధికారి గంజి రవీంద్రనాథ్, సహాయ కార్యదర్శి రామ నాథం పూర్ణచంద్రరావు, మునగపాటి వెంకటేశ్వ రరావు, వంగర లక్ష్మయ్య, జంజనం బిక్షారావు తదితరులు పాల్గొన్నారు.

కొప్పర్రుకు బస్సు సౌకర్యం కల్పించాలి

● ఆర్టీసీ ఆర్ఎంకు జనసేన నాయకుల విజ్ఞప్తి



ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

పెదనంపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొప్పర్రు గ్రామాకి గుంటూరు నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ జిల్లా, మండల జనసేన నేతలు ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్, డిపో-1 మేనేజర్ రామకృష్ణలకు వారి కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. ఐదేళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామానికి వచ్చేందుకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డామని, ఆటోల్లో ప్రయాణించడంతో పలుమార్లు ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో స్థానిక ఎమ్మెల్యేకు బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశామని, తాను కూడా బస్సు సర్వీసు కల్పించేందుకు హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు వెంటనే ఈ ప్రాంతానికి బస్సు ఏర్పాటు చేసి, ప్రయాణికుల వెతలు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య, నాయకులు దాసరి శ్రీనివాసరావు, డేగల వెంకట్రావు, సునీల్‌కుమార్, దాసరి రాంబాబు తదితరులు ఉన్నారు.

కేఎల్‌యూలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్

తాడేపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెలలో జరగనున్న ఎన్‌సీసీ బీ, సీ సర్టిఫికెట్ల గురించి వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఉన్న ఎన్‌సీసీ 10 ఆంధ్రా బాలికలు, 22 ఆంధ్రా బెటాలియన్ క్యాడెట్లకు అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తు మెరుగైన గ్రేడ్లు సాధించేందుకు క్యాడెట్‌లు శ్రాయశక్తులా కృషి చేయాలన్నారు. అనంతరం భారత వీరజవాన్ల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ కె.రాజశేఖరరావు, ప్రోవీసీలు ప్రసాద్, వెంకటరామ్, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, డీన్ కేఆర్ఎస్ ప్రసాద్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పావని తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి కొలికపూడి పరామర్శ

తాడికొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తాడికొండ మాజీ ఎంపీపీ, గుంటూరు జిల్లా తెలుగుమహిళ ప్రధాన కార్యదర్శి షేక్ రిజ్వాన జిలాని మామ టీడీపీ నాయకుడు షేక్ జిల్లా తండ్రి అయిన షేక్ బాజీ గురువారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శుక్రవారం రిజ్వాన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చెందిన అమరావతి జేఏసీ, టీడీపీ నాయకుడు పులి చిన్న తల్లి పులి మరియమ్మ జ్ఞాపకార్థ కూడిక సందర్భగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే కొలికపూడి పరామర్శించారు.

కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ



ఉన్నత విద్యామండలి కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కామన్ పీజీ సెట్‌ను రద్దు చేసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మండలి కార్యదర్శి కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. నాసర్‌జీ మాట్లాడుతూ 2021లో వైసీపీ ప్రభుత్వం కామన్ పీజీ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుందని, దీంతో వర్సిటీల్లో అడ్మిషన్లు లేక యూనివర్సిటీలన్నీ ఖాళీ ప్రదేశాలుగా మారాయని చెప్పారు. 2024 ఎన్నికల హామీలో మంత్రి నారా లోకేశ్ ఉమ్మడి పీజీ అడ్మిషన్లు రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, ఇటీవల ఉన్నత విద్యామండలి పాత పద్ధతిలోనే ప్రవేశాలను కల్పిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసిందని చెప్పారు. గత ప్రభుత్వ విధానాలనే ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తూ ఉన్నత విద్యను ప్రైవేటీకరణ చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడే విధంగా ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీలోనే ప్రవేశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు యశ్వంత్, డేవిడ్, గౌతమ్, సాగర్, రాహుల్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి కే ప్రవీణ్‌కుమార్

పెదనంపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి కే ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక సాయిమందిర్ అన్నపూర్ణాలయంలో శుక్రవారం కిరాణా మర్చంట్స్, హోటల్స్, పలు దుకాణాల సభ్యులకు ఆహార భద్రతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సరుకులు విక్రయించాలని, నిర్దేశించిన ధరలకే విక్రయాలు జరపాలని, కల్తీ ఆహార పదార్థాలు అమ్మినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. కల్తీ ఆహార పదార్థాలు తిని వ్యక్తి మరణిస్తే ఆయా దుకాణాదారులకు రూ.10లక్షలు జరిమానా విధిస్తామని తెలిపారు. కాలంచెల్లిన నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాలు విక్రయించరాదని, అమ్మకాలు జరిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జామవా, సాయినాథ్‌లు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో పలు వార్డులలో నేడు శనివారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఐతానగర్‌లోని ప్రధాన తాగునీటి పైపులైన్ లీకులకు మరమ్మతు పనులు జరుగుతున్నందున పట్టణంలోని 1వ వార్డు నుంచి 20వ వార్డు, 35వ వార్డు నుంచి 40వ వార్డు వరకు ఉదయం నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సొంతభూమి కలిగిన రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలి: ఏవో

తెనాలి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సొంత వ్యవసాయ భూమి ఉన్న రైతులు దగ్గరలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి రైతు కార్డు పొందేందుకు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కంచర్లపాలెంలోని రైతు సేవా కేంద్రాన్ని ఏవో సందర్శించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రేమసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వివిధ పథకాలను పొందేందుకు సొంతభూమి కలిగిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరుతో స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. అక్కడ రైతుల వివరాలను వ్యవసాయ సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసి 12 అంకెల నెంబరును జారీ చేస్తారన్నారు. ఈ నెంబరు ఆధారంగా పంట కొనుగోలు, బ్యాంకు రుణాలు, సబ్సిడీలు, ఇతర పథకాలకు అర్హులవుతారని చెప్పారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సిబ్బంది కూడా గ్రామాల్లో రైతులకు రైతు కార్డు పొందే విధానంపై అవగాహన పెంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని ఆయన సూచించారు. పలువురు రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు తెనాలి రానున్న పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత శ్రీవాసవి పెనుగొండ దేవాలయ ట్రస్ట్ పీఠాధిపతిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామిజీ) శనివారం తెనాలి రానున్నరని సాలిగ్రామ మఠం ట్రస్టు సెక్రటరీ రావూరి సుబ్బారావు తెలిపారు. పీఠాధిరోహణ అనంతరం తొలిసారిగా విచ్చేస్తున్న స్వామిజీకి స్వాగతం పలికేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శనివారం సాయంత్రం 4.35గంటలకు వీఎస్ఆర్ కాలేజి వద్ద ఉన్న మహాగణపతి విగ్రహం నుంచి మార్కెట్ సెంటర్ మీదుగా గంగానమ్మపేటలోని శ్రీవిద్యా పీఠం వరకు శోభాయాత్ర నిర్వహిస్తామని భక్తులు వేల సంఖ్యలో పాల్గొని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరావు, పెనుగొండ వెంకటేశ్వరావు, కోన నాగేశ్వరావు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారై డిగ్రీ కళాశాలలో 99 శాతం ఉత్తీర్ణత

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నారై డిగ్రీ కళాశాలలో 5వ సెమిస్టర్ పరీక్షల్లో 99శాతం ఉత్తీర్ణత సాధించారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సీఈవో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పరీక్షా ఫలితాలను శుక్రవారం విడుదల చేసిందన్నారు. తమ కళాశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఉపాధి లభించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ లాజరుబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు అన్నవరం, దావులూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

కొల్లిపర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర సబ్‌స్టేషన్ పరిధిలో అన్నవరం, దావులూరు ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నవరం ఫీడర్‌లో హనుమాన్‌పాలెం, అన్నవరం, బొమ్మువానిపాలెం, తూములూరు, అదేవిధంగా దావులూరు ఫీడర్ పరిధిలో చెముడుబాడు, చెముడుబాడుపాలెం, దావులూరు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు.

శివాజీ చౌక్‌లో అన్నదానం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాజీచౌక్‌లో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కాళీ మాత ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ ప్రారంభించారు. గుణశేఖర్, నాగవర్ధన్, భార్గవి, వెంకటరమణల సహకారంతో అన్నదానం నిర్వహించారు. కందేపి సీతారామయ్య, యర్రు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళి

పెదకాకాని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో భారత సీఆర్పీఎఫ్ జవాన్లపై ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కార్యదర్శి వంశీ మాట్లాడుతూ జమ్మూ, కాశ్మీర్లో ఉగ్రవాద ముష్కరులు భారత్ సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడిలో వీరమరణం పొందిన జవాన్ల ఆత్మకు శాంతి కలగాలన్నారు. ఎన్ని ఉగ్రవాదుల సంహాలు వచ్చినా భారతదేశం ఎప్పుడు ఒకటిగా కలిసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వవిద్యాలయ కన్వీనర్ గంగాధర్, యూనివర్సిటీ అధ్యక్షురాలు చంద్రిక, యూనివర్సిటీ కార్యదర్శి వంశీ, ఉపాధ్యక్షుడు హేమంత్ రామ్, జర్నలిజం విభాగం అజయ్‌రామ్, ఇతర కార్యకర్తలు పాల్గొని నివాళి అర్పించారు.

చిట్టడవిలా టిడ్కో గృహ పరిసరాలు

● గృహంలోని బాత్‌రూంలో మహిళకు పాముకాటు ● చికిత్సతో తప్పిన ప్రాణాపాయం ● గృహ పరిసరాల్లో అసౌకర్యాలపై స్థానికుల్లో ఆగ్రహం



టిడ్కో గృహసముదాయం మధ్యలో పెరిగిన పిచ్చి మొక్కలు

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెనాలి జగ్గడిగుంటపాలెం టిడ్కో సముదాయం చిట్టడవిని తలపిస్తోంది. గృహాల నడుమ పిచ్చిమొక్కలతో పొదలను తలపిస్తున్నాయి. టిడ్కో గృహంలో నివాసముంటున్న మహిళ మంగళవారం పాము కాటుకు గురైంది. తెనాలి జగ్గడిగుంటపాలెం టిడ్కో సముదాయంలో గత ప్రభుత్వం సరైన సౌకర్యాలు కల్పించకుండా హడావిడిగా గృహప్రవేశాలు చేయించింది. గృహాలకు గృహాలకు మధ్య పొదల్లా పిచ్చిమొక్కలు అల్లుకుని భయానకంగా ఉన్నా కనీసం అధికారులు సైతం వాటిని పట్టించుకోలేదు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే మంగళవారం ఆ గృహ సముదాయాల్లో నివాసం ఉంటున్న మరియమ్మ మధ్యాహ్న సమయంలో బాత్రూమ్‌కు వెళ్లగా అక్కఉన్న పాము కాలుపై కాటువేసింది. దీంతో మహిళ పాముకాటువేసిన కాలుకు తాడుతో కట్టుకట్టుకుని భర్తకు సమాచారం ఇచ్చింది. ఆ ప్రాంతంలో కనీసం ప్రాథమిక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయకపోవడంతో అక్కడి నుంచి తెనాలి వచ్చేందుకు కనీసం, ఆటో, బస్సు సౌకర్యాలు కూడా లేకపోవడంతో దాదాపుగా 4 కిలోమీటర్ల మేర భర్త ద్విచక్రవాహనంపై తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల అత్యవసర విభాగానికి వెళ్లింది. వైద్యులు పరీక్షలు జరిపి విషం విరుగుడుకు ఇంజక్షన్ చేసి ఆమె తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పి పంపించారు. తిరిగి గురువారం ఆమెకు స్వల్ప అస్వస్థత గురవటంతో వైద్యశాలను సంప్రదించగా వైద్యులు మూడు రోజుల పాటు వైద్యశాల్లో ఉండి చికిత్స చేయించుకోవాలని సూచించారు. దీంతో ఆమె వైద్యశాల్లో చికిత్స పొందుతుంది. తాము ఉండే టిడ్కో గృహాల సముదాయంలో తిరిగి నివసించాలంటే భయంగా ఉందని ఆరోగ్యం కుదుటపడిన వెంటనే ఆ ప్రాంతాన్ని కాళీ చేసి మరో ప్రాంతంలో అద్దెకు వెళ్తామని ఆవేదనతో తెలిపింది. గత ప్రభుత్వంలో రోడ్డు సౌకర్యం కోసం బ్రిడ్జి వేయిస్తామని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని గృహప్రవేశాలు చేయించి ఆ తరువాత పట్టించుకున్న వారే లేరని వాపోయింది. గృహాల చుట్టూ చిట్టడివిని తలపించేలా చెట్లు పెరిగిపోయాయని పగలు మగవాళ్లు ఉపాధి కోసం తెనాలి ఇతర ప్రాంతాలకు వెళ్లారని ఒంటరిగా మహిళలు, చిన్నపిల్లలు ఉండాల్సి ఉండగా కళ్ల ముందే పాములు తిరుగుతున్నాయని చెప్పింది.ఈ విషయాన్ని మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పింది. టిడ్కో గృహాల వద్దకు రేషన్ బియ్యం కూడా రావడంలేదని, తాగునీటికి అవస్థలు తప్పటం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి గృహాల వద్ద సౌకర్యాలు మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలి

● సబ్ కలెక్టర్ సంజనా సింహ



ఓటు వేస్తానని ప్రమాణం చేస్తున్న సబ్ కలెక్టర్ సంజనా సింహ, తహసీల్దార్ గోపాలకృష్ణ, కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో పట్టభద్రుల ఓటర్లు అందరూ వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ సంజనా సింహ అన్నారు. శుక్రవారం పట్టణ పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణలతో కలసి సబ్ కలెక్టర్ సంజనా సింహ సచివాలయ ఉద్యోగులకు పవర్ ప్రజంటేషన్ ద్వారా ఓటువేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కు ద్వారా నచ్చిన అభ్యర్థిని ఎన్నుకునేలా ఓటు హక్కును కల్పించిందన్నారు. మరో 10రోజుల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని ఓటు కలిగిన పట్టభద్రులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో బ్యాలెట్ పేపర్ విధానం ద్వారా అభ్యర్థిని ఎన్నుకోవలసి ఉంటుందన్నారు. ఓటు వేసేందుకు వెళ్లేవారు ప్రభుత్వం నుంచి జారీఅయిన గుర్తింపు కార్డును వెంట తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలన్నారు. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థుల పేర్లు రాజకీయ పార్టీపేరు ఉంటుందని ఓటు వేసేవారు ప్రథమ ప్రాధాన్య ఓటుకు 1 అంకె వేయాలని, టిక్కులు గాని గుర్తులు గాని వేయరాదని తెలియజేశారు. ఒకవేళ టిక్కులు లేదా గుర్తులు వేస్తే అవిచెల్లవని దీనిపై ప్రజలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఉద్యోగులతో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ, పలు శాఖల మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించండి

● పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహిత



ఫ్రైడే డ్రైడే ర్యాలీని నిర్వహిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి బాలచంద్రమౌళి, డాక్టర్ మహిత తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రతలతో పాటు వ్యక్తిగత శుభ్రతలను పాటించాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహిత అన్నారు. శుక్రవారం స్థానిక సుల్తానాబాదులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహిత మలేరియా అధికారులతో కలసి ఫ్రైడే డ్రైడే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్‌గునియా వంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటి పరిసరాల పరిశుభ్రతలను పాటించాలని నీటి నిల్వలు లేకుండా చూడాలని దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సబ్‌యూనిట్ అధికారి అందె బాలచంద్రమౌళి, ఏఎన్ఎంలు లత, రాణి, అరుణ, అనిత, తిరుపతమ్మ, ఆశా కార్యకర్తలు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ




క్వారీ దేవాలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

చేబ్రోలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే మహిమాన్విత పుణ్యక్షేత్రం క్వారీ దేవాలయం తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం వడ్లమూడి శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని తిరునాళ్ల ఏర్పాట్లు పై సమీక్ష నిర్వహించారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. నారా కోడూరు, తెనాలి ప్రధాన రహదారిపై ట్రాఫిక్ మళ్లింపు వంటి చర్యలపై స్థానిక అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తెనాలి డీఎస్పీ జనార్ధనరావు, పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ వెంకటకృష్ణ, తహసీల్దార్ కే శ్రీనివాసశర్మ, ఆలయ ఈవో రాంకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ సమస్యలపై సంపూర్ణ అవగాహన అవసరం: స్రవంతి

పొన్నూరు టౌన్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై సంపూర్ణ అవగాహన అవసరమని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ డైరెక్టర్ స్రవంతి అన్నారు. శుక్రవారం పొన్నూరు పట్టణంలోని పలు పాఠశాలలను సందర్శించిన స్రవంతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. సమావేశంలో ఎంఈవో కే శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసమీరా, ప్రాజెక్టు ఆఫీసర్‌లు సత్యనారాయణ, అప్పారావు, శివకుమార్, శ్రీనివాసరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ రంగనాథరావుకు విశ్వనాథ సంస్కృతి పురస్కారం



విశ్వనాథ సంస్కృతి పురస్కారంను ప్రదానం చేస్తున్న వీవీ ఐటీ అధ్యాపకులు

పెదకాకాని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు విశ్వనాథ సాహిత్య అకాడమీ ప్రతి సంవత్సరం కళారంగానికి చెందిన ప్రముఖులకు అందించే విశ్వనాథ సంస్కృతి పురస్కార వేడుకను వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో శుక్రవారం నిర్వహించారు. ఈ వేడకలో 2025 సంవత్సరానికిగాను కర్నాటక రాష్ట్రం బెంగళూరు నగరానికి చెందిన బొమ్మలాట కళాకారులు, ఎంఆర్ రంగనాదరావుకు విశ్వనాథ సంస్కృతి పురస్కారం, ప్రముఖ రంగస్థలం నటుడు దర్శకుడు రౌతు వాసుదేవరావుకు సూర్యకాంతం స్మారక రంగస్థలం పురస్కారం 2025ను ప్రకటించారు. వారి తరపున వారి కుమారుడు ఎమ్.ఆర్ శ్రీనివాసరావుగారు ఈ పురస్కారాన్ని అందజేశారు. సభానంతరం ఎనిమిది మంది కళాకారుల బృందం కలిసి శ్రీకృష్ణ తులాభారం బొమ్మలాటను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ నాటక రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు, పి సత్యనారాయణరాజు, రావెల సాంబశివరావు, భూసురుపల్లి వెంకటేశ్వర్లు, మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.

వయోలిన్ విద్వాంసుడు యలమందరాజుకు నివాళి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వయోలిన్ విద్వాంసుడు కూరపాటి యలమందరాజు సంస్మరణ ఉత్సవం శుక్రవారం రాత్రి గోవర్ధనస్వామి ఆలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దూళిపాళ్ల శివరామకృష్ణశర్మ హరికథా గానం చేశారు.

అక్రమంగా తరలిస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కొల్లిపర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెం, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం, అన్నవరం తదితర గ్రామాల్లో ఇసుకరీచ్‌ల్లో ఎస్ఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కృష్ణా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సీజ్‌చేసిన ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించడంతో తహసీల్దార్ సిద్ధార్థ ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.10వేలు జరిమానా వేసినట్లు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

● అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 14: అగ్రిగోల్డ్ బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఎం.షరీఫ్ అధ్యక్షతన అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థ 8 రాష్ట్రాలలో 32 లక్షమంది నుంచి రూ.7వేల కోట్లు సేకరించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 19.52 లక్షలమంది నుంచి రూ.3867 కోట్లు సేకరించి భారీ ఆర్థిక కుంభకోణానికి పాల్పడిందన్నారు. అయితే అగ్రిగోల్డ్ కస్టమర్లు ఏజెంట్‌ల పోరాట ఫలితంగా మృతి చెందిన 142మందికి గతంలో చంద్రబాబు నాయుడు రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చారన్నారు. రూ.250కోట్లు కార్పస్ ఫండ్‌గా ఇచ్చినట్లు చెప్పారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితుల కష్టాలను తీర్చుతామని ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీ మరచిపోయిందని ఆరోపించారు. బాధితులకు తక్షణమే ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో షేక్ కరీముల్లా, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

● మాజీ ఎమ్మెల్యే శివకుమార్



ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియం కేరీని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమైనదని మాజీ ఎమ్మెల్యే, ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మారుతున్న సమాజంలో ఫార్మసిస్టులుగా రాణించడం ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని, నిరంతర అధ్యయనం, వినూత్న ఆలోచనలతో కష్టపడి పనిచేస్తేనే ఫలితం వస్తుందన్నారు. ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ విలియం కేరీ మాట్లాడుతూ, సీనియర్ల అనుభవాలను జూనియర్లకు వివరించాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే సబ్జెక్టుపై పట్టుతో పాటు నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



పుష్పాలంకరణ పూజలు చేస్తున్న అర్చకులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులోని శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. స్వామి అమ్మవార్లకు పుష్పాలంకరణ సేవ చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు శ్రీనివాసమూర్తి, కౌండిల్య, బాలకృష్ణ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● డీవైఈవో శాంతకుమారి

కొల్లిపర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీవైఈవో శాంతకుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ నిర్వహించారు. హైస్కూల్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం క్లాస్ రూమ్‌లోకి వెళ్ళి పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీవైఈవో వెంట ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలత, ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు తదితరులు ఉన్నారు.

భూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

● సబ్ కలెక్టర్ సంజనా సింహ



కుంచవరంలో భూ రీసర్వే గురించి రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సంజనా సింహ

కొల్లిపర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతులు భూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ సంజనా సింహ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కుంచవరంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వేను ఆమె పరిశీలించారు. భూమికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. భూ రీ సర్వేపై రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. భూ రీ సర్వే చేయడం వలన కలిగే ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా సంజనా సింహ మాట్లాడుతూ భూ రీ సర్వే ద్వారా పొలాల్లో ఎలాంటి తప్పులు ఉన్నా వాటిని సరి చేయనున్నట్లు తెలిపారు. హద్దులు గుర్తించి రాళ్లు వేయనున్నట్లు తెలియజేశారు. భూ రీ సర్వేలో అవకతవకలు జరిగితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. భూ రీ సర్వేకు రైతులు కూడా సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉప్పాల రాజేష్, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో భాషా పాల్గొన్నారు.

తెనాలి ప్రాంతంలో బర్డ్‌ఫ్లూ కేసులు లేవు

● పౌల్ట్రీలో పనిచేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోండి
● పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి



డాక్టర్ నాగిరెడ్డి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కోళ్లల్లో బర్డ్‌ఫ్లూ కేసులు పెరుగుతున్నాయని విస్తృతంగా ప్రచారం జరుగుతోందని తెనాలి ప్రాంతంలో ఇంతవరకూ అటువంటి కేసులు నమోదు కాలేదని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి చెప్పారు. శుక్రవారం తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో విలేకరులతో డాక్టర్ నాగిరెడ్డి బర్డ్‌ఫ్లూ వైరస్‌పై మాట్లాడారు. కోళ్లల్లో బర్డ్‌ఫ్లూ వ్యాపించి పలు ప్రాంతాల్లో మృతి చెందుతున్నాయన్న వార్తలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నా బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిన కోడి నుంచి మరో కోడికి వ్యాపిస్తుందన్నారు. సాధారణ ప్రజలకు ఈ వ్యాధి వ్యాప్తి చెందదన్నారు. పౌల్ట్రీ నిర్వాహకులు సైతం కోళ్లకు ఈ వ్యాధి సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పౌల్ట్రీ రైతులు బయో సెక్యూరిటీ చర్యలు పాటించాలని సూచించారు. కోళ్ల షెడ్ల ప్రవేశమార్గంలో ఫుట్‌పాత్‌లు 0.01శాతం పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం, షెడ్ల పరిసరాల్లో 2శాతం సోడియం హైపోక్లోరైట్ లేదా బ్లీచింగ్ పౌడర్ వంటివి చల్లడం మంచిదన్నారు. పౌల్ట్రీలో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రతలు పాటించాలని కోరారు. పౌల్ట్రీలో కోళ్లు చనిపోతే సంబంధిత పశువైద్యశాలకు తెలిపి వాటిని పరీక్షలు జరిపిన అనంతరం పూడ్చిపెట్టాలని సూచించారు. బర్డ్‌ఫ్లూ వైరస్‌పై ఆందోళన చెందవద్దని బాగా ఉడికించిన చికెన్, గుడ్లు తినవచ్చని మాంసప్రియులకు ఆయన సూచించారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో డాక్టర్ సునీత, సెక్టార్ సూపర్‌వైజర్లు హిమబిందు, నాగమణి తదితరులు

పోషణ్ భీ - పడాయి భీపై అవగాహన ఉండాలి

● సీడీపీవో డాక్టర్ సునీత

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో డాక్టర్ ఎం.సునీత అంగన్‌వాడీ కార్యకర్తలతో అన్నారు. స్థానిక కొత్తపేటలోని బాలురోన్నత పాఠశాలలో శుక్రవారం పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో డాక్టర్ ఎం.సునీత అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండో రోజు కార్యక్రమంలో భాగంగా పిల్లల్లో పోషకాహార లోపం, పిల్లలకు పోషకాహార ప్రాముఖ్యం, గ్రోత్ మానిటరింగ్, పోషణ్ ట్రాకర్ మొదలైన వాటిపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అనంతరం మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎన్‌హెచ్ స్కూల్‌లో విద్యార్థులకు పోషణ్ భీ పడాయి భీ శిక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు హిమబిందు, నాగమణి, రాధిక, యానాదమ్మ, వెంకటరమణ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ భీ - పడాయి భీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ - పడాయి భీ కార్యక్రమంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారులు పోషకాహార లోపం బారినపడకుండా చూసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యామిని మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలు పోషకాహారం తీసుకోవడం వలన అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటన మండలంలోని కొలకలూరులో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గుంటూరు నుంచి నందివెలుగు కూడలి వైపు వస్తున్న కారు నందివెలుగు నుంచి కొలకలూరు వైపు వెళుతున్న ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళుతున్న భార్యాభర్తలు కిందపడి గాయపడ్డారు. వారిని 108లో తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు తరలించారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

● భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి

కొల్లిపర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో అన్నివిధాలా విఫలమైనట్లు భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూములూరు శ్రీగంగానమ్మ గుడి అవరణలో జరిగిన రైతు ప్రతినిధుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు రాష్ట్ర భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గ సభ్యుడు వంగా సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి కొండబాబు, భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గ సభ్యులు జి. రాంబాబు, వింతా వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి గెలుపునకు పాటుపడతాం: లక్ష్మీనారాయణ చౌదరి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి పార్టీల అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపునకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకున్నట్లు టీడీపీ అధికార ప్రతినిధి టీ లక్ష్మీనారాయణ చౌదరి తెలిపారు. శుక్రవారం స్థానిక నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై సమీక్ష సమావేశం జరిగింది.